


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 222 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు శుక్రవారం 17 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :222 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE FRI 17 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఏపీలో ఇంటింటి గణన ప్రారంభం...

### స్వయంగా తన వివరాలు నమోదు చేసుకున్న సీఎం చంద్రబాబు

- ఏపీలో ఇంటింటి గణన, గృహాల జాబితా సేకరణ ప్రారంభం
- స్వీయ నమోదు ప్రక్రియను ఆరంభించిన సీఎం చంద్రబాబు
- ఆన్‌లైన్‌లో తన వివరాలను స్వయంగా నమోదు చేసుకున్న ముఖ్యమంత్రి
- మొత్తం 33 ప్రశ్నలతో కూడిన సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ
- ఈ నెల 30వ తేదీ వరకు ప్రజలు వివరాలు నమోదు చేసుకునే అవకాశం



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో గురువారం ప్రారంభమైన స్వీయ జనగణన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. హౌస్ లిస్టింగ్-హౌస్ సెన్సెస్ ప్రక్రియలో భాగంగా, తొలి వ్యక్తిగా తన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

మిగతా 2లో



## లోక్‌సభలో.. గరం గరం!


### మూడు కీలక బిల్లులు ప్రవేశపెట్టిన కేంద్రం

- మహిళా రిజర్వేషన్లు, రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్ బిల్లు
- మెజార్టీ సభ్యుల మద్దతుతో చర్చకు ఆమోదం
- సుమారు 15 నుంచి 18 గంటల పాటు చర్చ సాగే అవకాశం
- దీనిపై నేడు సాయంత్రం 4 గంటలకు ఓటింగ్
- మహిళా బిల్లును వ్యతిరేకించిన అసదుద్దీన్ ఒవైసీ
- బిల్లు ఆమోదానికి తొందరెందుకన్న అఖిలేష్ యాదవ్
- ఇప్పటికే తమ అభిప్రాయం చెప్పామన్న సోనియా గాంధీ
- ఎప్పుడో ఆమోదం పొందిన బిల్లుపై మళ్లీ చర్చా.. ప్రధాని మోదీని నిలదీసిన ఎంపీ కేసీ వేణుగోపాల్
- ఘాటుగా కౌంటర్ ఇచ్చిన హోమ్ మంత్రి అమిత్ షా

పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు కీలక బిల్లులపై చర్చించేందుకు లోక్సభ లాంఛనంగా ఆమోదం తెలి పింది. మహిళా రిజర్వేషన్లు, నియోజక వర్గాల పునర్విభజన తదితర అంశా లతో కూడిన ఈ బిల్లులపై సభలో సభ్యులు సుదీర్ఘంగా చర్చలు జరపను న్నారు.కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసు కువచ్చిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, డీలిమిటేషన్ బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లులకు ఈ చర్చల జాబితాలో చోటు దక్కింది. ఈ బిల్లులపై విపక్ష, అధికార పక్ష సభ్యుల వాడివేడి చర్చల అనంతరం (శు క్రవారం) సాయంత్రం సరిగ్గా 4 గంటలకు మూడు బిల్లులపైన ఓటింగ్ నిర్వహి చనున్నట్లు స్పీకర్ ఓం బిర్లా అధికారి కంగా ప్రకటించారు.

పెన్ పవర్ డెస్క్:కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై (నారీ శక్తి వందన్ అధినియం) పార్లమెంటులో వాడివేడి చర్చ జరిగింది. ఈ బిల్లులో ఓబీసీ, ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా కల్పించాలన్న డిమాండ్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ మధ్య తీవ్ర వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. ఈ చర్చలో అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ.. మహిళలకు కేటాయించిన 33శాతం రిజర్వేషన్లలో వెనుకబడిన వర్గాలు (ఓబీసీ), ముస్లిం మహిళలకు ప్రత్యేకంగా ఉప-కోటా కేటాయించాలని డిమాండ్ చేశారు. అప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అఖిలేశ్ డిమాండ్‌పై అమిత్ షా తీవ్రంగా స్పందించారు. భారత రాజ్యాంగం ప్రకారం మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడం అసాధ్యమని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే విపక్షాలు ఇలాంటి డిమాండ్లు చేస్తున్నాయని విమర్శించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తికి ఇది పూర్తిగా విరుద్ధమని ప్రభుత్వం తరఫున

మిగతా 2లో



## తెలంగాణలో టాప్ 3 కులాలు ఇవే...

### నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం

- తెలంగాణ కుల సర్వే అధికారిక గణంకాలను విడుదల చేసిన ప్రభుత్వం
- రాష్ట్రంలో 56.36 శాతంతో బీసీలదే అగ్రస్థానం అని వెల్లడి
- జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో
- ఓసీల్లో రెడ్డి, ఎస్టీల్లో లంబాడీల జనాభా అత్యధికం
- దాదాపు 4 శాతం మంది ప్రజలు తమకు కులం లేదని వెల్లడించిన వైనం

మిగతా 2లో



## అనిల్ అంబానీకి సుప్రీంకోర్టులో చుక్కెదురు

- రిలయన్స్ కమ్యూనికేషన్స్ రుణ ఖాతాలను మోసపూరిత ఖాతాలుగా ప్రకటించిన బ్యాంకులు
- మోసపూరిత ఖాతాల విషయంలో చర్యలకు అనుమతించిన బాంబే హైకోర్టు
- సుప్రీంకోర్టులో సవాల్ చేసిన అనిల్ అంబానీ

పెన్ పవర్ డెస్క్: రిలయన్స్ కమ్యూనికేషన్స్ గ్రూప్ కంపెనీల రుణ ఖాతాలను మోసపూ రితమైనవిగా పేర్కొనడాన్ని సవాల్ చేస్తూ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

మిగతా 2లో

## గృహిణులకు రూ.2,500, నిరుద్యోగులకు రూ.4,000...

### భారీ హామీలతో 'టీవీకే' మానిఫెస్టో ఆవిష్కరించిన విజయ్

- 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం టీవీకే మేనిఫెస్టో విడుదల
- గృహిణులకు నెలకు రూ.2,500, నిరుద్యోగ భృతిగా రూ.4,000 హామీ
- ఏడాదికి 6 గ్యాస్ సిలిండర్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- పాలన, విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం
- తమిళనాడును డ్రగ్ ఫ్రీ రాష్ట్రంగా మార్చడమే లక్ష్యం

మిగతా 2లో



## ఏపీలో భగ్గుమన్న సూరీడు.. నంద్యాలలో 45.1 డిగ్రీలు.. నేడు మరింత తీవ్రత!

- ఏపీలో రికార్డు స్థాయికి ఉష్ణోగ్రతలు
- నంద్యాల జిల్లాలో 45.1 డిగ్రీలకు చేరిన గరిష్ఠ ఉష్ణోగ్రత
- పలు జిల్లాల్లో 44 డిగ్రీలు దాటే అవకాశం ఉందని అంచనా
- రాష్ట్రంలోని 85 మండలాల్లో వడగాలులు వీస్తాయని హెచ్చరిక
- ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించిన విపత్తుల నిర్వహణ సంస్థ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మండిపోతున్నాయి. గురువారం నాడు రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నంద్యాల జిల్లా సంజామలలో అత్యధికంగా 45.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవగా, కడప జిల్లా ఒంటిమిట్టలో 44.9 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. రాష్ట్రంలో

మిగతా 2లో





## నారీ శక్తి చట్టం చరిత్రాత్మకం

- మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మక ముందడుగు అని కొనియాడిన పవన్
- మహిళా సాధికారతకు జనసేన పార్టీ కట్టుబడి ఉందని స్పష్టీకరణ
- వివిధ రంగాల్లో రాణిస్తున్న భారత మహిళల విజయాలను ప్రస్తావించిన పవన్
- నారీశక్తి అనేది నినాదం కాదని, మన నాగరికతకు బలమని వ్యాఖ్య
- రాజ్యాంగ రూపకల్పనలో మహిళల పాత్రను గుర్తు చేసుకున్న జనసేనాని

మిగతా 2లో

## జగన్ బతుకే ఒక అరాచకం

### మంత్రి కొల్లు రవీంద్ర ఫైర్

- ఐదేళ్లు జువ్వలదిన్నె హార్బర్‌ను అడ్డుకున్నది జగనే అని ఆరోపణ
- మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీశారని ఘాటు వ్యాఖ్యలు
- దేశ రక్షణ సంస్థను వ్యతిరేకించడం జగన్ దుర్మార్గపు ఆలోచన అని ఘాటు విమర్శలు
- గొడ్డలి రాజకీయమే జగన్ విధానమని తీవ్ర స్థాయిలో ధ్వజం

మిగతా 2లో





## ప్రభుత్వ పాఠశాలల పనులు ఇకపై ఎస్ఎంసీలకే...

- పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష
- అన్ని ప్రభుత్వ స్కూళ్లను 3 స్టార్‌కు చేర్చాలని ఆదేశం
- ప్రవేశాల పెంపునకు డోర్ టు డోర్ క్యాంపెయిన్‌కు పిలుపు
- ప్రభుత్వ కాలేజీల్లో టాపర్లకు విస్తృత ప్రచారం కల్పించాలని సూచన

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చే దిశగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కీలక ఆదేశాలు జారీ చేశారు.

మిగతా 2లో



## మహిళా బిల్లుతో దేశ రాజకీయాల దిశ, దశ మారతాయి

- లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- బిల్లుపై మూజువాణి ఓటింగ్‌ను వ్యతిరేకించి డివిజన్‌కు పట్టుబట్టిన విపక్షాలు
- ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 251, వ్యతిరేకంగా 185 ఓట్లు
- బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని పార్టీలకు ప్రధాని విజ్ఞప్తి

మిగతా 2లో



## రేవంత్ రెడ్డి వాదన విని తెలంగాణ ప్రజలు నవ్వుతున్నారు

- డీలిమిటేషన్‌కు జీఎస్‌డీపీని ముడిపెట్టడం మూర్ఖత్వమన్న తేజస్వీ సూర్య
- నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని హామీ
- ఏపీ, తెలంగాణలను కాంగ్రెస్ విభజించిన తీరు బ్రిటీష్ కంటే దారుణంగా ఉందని వ్యాఖ్య
- కాంగ్రెస్ చేసిన విభజన కారణంగా ఏపీ, తెలంగాణ మధ్య నేటికీ ఘర్షణ వాతావరణం ఉందన్న ఎంపీ

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## అనిల్ అంబానీకి సుప్రీంకోర్టులో చుక్కెదురు

- మొదటి పేజి తరువాయి

రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు చెందిన మోసపూరిత ఖాతాల విషయంలో చర్యలకు బాంబే హైకోర్టు అనుమతించడాన్ని ఆయన సవాల్ చేయగా, సుప్రీంకోర్టులో చుక్కెదురైంది.
ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తన నిర్ణయాన్ని ప్రకటించింది. అయితే బ్యాంకులిచ్చిన షోకాజ్ నోటీసులపై హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ వద్ద తన వాదనలు వినిపించుకోవడానికి అనిల్ అంబానీకి అనుమతిచ్చింది. ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని హైకోర్టుకు సూచించింది.
బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, ఐడీబీఐ బ్యాంకులు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఖాతాలను మోసపూరితమైనవిగా ప్రకటించాయి. బ్యాంకులు చేసిన ప్రకటనపై అనిల్ అంబానీ బాంబే హైకోర్టులో సవాల్ చేశారు. విచారించిన హైకోర్టు సింగిల్ బెంచ్, వాటిపై స్టే విధించడంతో పాటు భవిష్యత్తులో చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇచ్చింది. మోసపూరిత ఖాతాలుగా గుర్తించే విషయంలో ఆర్బీఐ మార్గదర్శకాలు పాటించలేదని పేర్కొంది.దీనితో మూడు బ్యాంకులు అప్పీలుకు వెళ్లాయి. విచారించిన హైకోర్టు డివిజన్ బెంచ్, సింగిల్ బెంచ్ ఉత్తర్వులను కొట్టివేసింది. ఈ క్రమంలో అనిల్ అంబానీ డివిజన్ బెంచ్ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయగా, చుక్కెదురైంది.

## తెలంగాణలో టాప్ 3 కులాలు ఇవే...
## నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వేకు సంబంధించిన అధికారిక గణంకాలను విడుదల చేసింది. ఈ సర్వే ప్రకారం రాష్ట్ర జనాభాలో వెనుకబడిన తరగతులు (బీసీలు) 56.36 శాతంతో అతిపెద్ద సామాజిక వర్గంగా నిలిచారు. జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. దేశంలోనే ఆదర్శవంతంగా, అత్యంత పారదర్శకంగా ఈ సర్వే ప్రక్రియను పూర్తి చేశామని ప్రభుత్వం ప్రకటించింది.ఈ భారీ కసరత్తు కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.03 లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేశారు. ప్రజల నుంచి 'సెల్ఫ్ డిక్లరేషన్' పద్ధతిలో వివరాలను సేకరించారు. ఈ సర్వేలో భాగంగా మొత్తం 1,12,36,849 కుటుంబాలను సర్వే బృందాలు సందర్శించి, 3,55,50,759 మంది జనాభా వివరాలను నమోదు చేసినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో తెలిపింది.

**సామాజిక వర్గాల వారీగా జనాభా వాటా**

సర్వే ఫలితాల ప్రకారం, రాష్ట్ర జనాభాలో బీసీల తర్వాత షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు) 17.42 శాతం, అగ్రవర్ణాలు (ఓసీలు) 15.79 శాతం, షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) 10.43 శాతం చొప్పున ఉన్నారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సుమారు 4 శాతం మంది ప్రజలు తమకు ఎలాంటి కులం లేదని (చీశీ ఝుర్వ) తమ డిక్లరేషన్‌లో పేర్కొనడం గమనార్హం.

**కులాల వారీగా ప్రధాన వర్గాలు**

రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కులాల జాబితాను పరిశీలిస్తే, 36.58 లక్షల మందితో (10.3 శాతం) మాదిగ సామాజిక వర్గం మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత 27.96 లక్షల మందితో (7.9 శాతం) షేక్ ముస్లింలు రెండో స్థానంలో, 26.39 లక్షల జనాభాతో (7.4 శాతం) ముదిరాజ్ సామాజిక వర్గం మూడో స్థానంలో ఉన్నాయి.
ఓసీ వర్గాల్లో: రెడ్డి సామాజిక వర్గం 4.8 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో కోమటి (1.4 శాతం), కమ్మ (1.0 శాతం), బ్రాహ్మణ (0.9 శాతం), కాపు/నాయుడు (0.7 శాతం), వెలమ (0.4 శాతం) ఉన్నారు.
బీసీ వర్గాల్లో: షేక్ ముస్లింలు (7.9 శాతం) అత్యధిక జనాభాతో ముందుండగా, ముదిరాజ్ (7.4 శాతం), యాదవ (5.7 శాతం), గౌడ్ (4.6 శాతం), మున్నూరుకాపు (3.9 శాతం) తర్వాతి స్థానాల్లో నిలిచారు.
ఎస్సీ వర్గాల్లో: మాదిగ (10.3 శాతం) సామాజిక వర్గం అత్యధిక జనాభా కలిగి ఉండగా, మాల (4.1 శాతం), బేడా (0.5 శాతం), మాల సేల్ (0.5 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.
ఎస్టీ వర్గాల్లో: లంబాడీలు 6.8 శాతం జనాభాతో అగ్రస్థానంలో నిలిచారు. కోయ (1.2 శాతం), గోండ్ (1.1 శాతం), ఎరుకుల (0.5 శాతం) వారి తర్వాత ఉన్నారు.
ఈ సర్వే ద్వారా వెల్లడైన గణంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల రూపకల్పన, రాజకీయ సమీకరణాల్లో కీలక పాత్ర పోషించనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఏపీలో ఇంటింటి గణన ప్రారంభం...

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా ప్రజలందరూ ఈ ప్రక్రియలో భాగస్వాములై, రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.అమరావతిలోని తన నివాసంలో ంవ.ఎవఅంబం.స్త్రశీజ.అఅ వెబ్ సైట్ ద్వారా చంద్రబాబు వ్యక్తిగత వివరాలను నమోదు చేశారు. మొత్తం 33 ప్రశ్నలతో కూడిన ఈ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను ఏపీ జనగణన డైరెక్టర్ జె. నివాస్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రజలు స్వయంగా ఆన్‌లైన్‌లో తమ ఇళ్ల వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని, మే 1 నుంచి 30 వరకు ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వచ్చి భౌతికంగా వివరాలు సేకరిస్తారని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలోని పౌరులందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు సమానంగా అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దీనికోసం కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం అవసరమని, ఈ లక్ష్య సాధనలో జనగణన కార్యక్రమం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో జనగణన జరగడం ఇదే తొలిసారి అని, ఇది కేవలం సమాచార సేకరణ మాత్రమే కాదని, రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని అభిప్రాయపడ్డారు.జనాభా లెక్కల కార్యక్రమం రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశలో భాగంగా ప్రస్తుతం ఇళ్ల గణన ప్రారంభమైందని, వచ్చే ఏడాది రెండో దశలో జనాభా లెక్కల సేకరణ చేపడతారని సీఎం వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ నమోదు అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ సరైన వివరాలు నమోదు చేసి ఈ బృహత్కార్యాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఏపీలో భగ్గుమన్న సూరీడు..
## నంద్యాలలో 45.1 డిగ్రీలు..

- మొదటి పేజి తరువాయి

ఎండల తీవ్రతకు ఇది అద్దం పడుతోంది.ఈ నేపథ్యంలో, రాబోయే 24 గంటల్లోనూ ఎండల తీవ్రత కొనసాగుతుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరించింది. శుక్రవారం (ఏప్రిల్ 17) కూడా పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు భారీగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ముఖ్యంగా మన్యం, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరుతో పాటు రాయలసీమ జిల్లాల్లో గరిష్ఠంగా 43 నుంచి 44.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే సూచనలు ఉన్నాయని పేర్కొంది.అంతేకాకుండా, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని ఏపీఎస్డీఎంఏ హెచ్చరించింది. మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి, పోలవరం ప్రాంతాల్లోని సుమారు 30 మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 55 మండలాల్లో సాధారణ వడగాలులు వీచే అవకాశం ఉందని అంచనా వేసింది.ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా మధ్యాహ్నా వేళల్లో బయటకు వెళ్లవద్దని సూచించింది. వృద్ధులు, చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

# లోక్‌సభలో.. గరం గరం!

- మొదటి పేజి తరువాయి

ఆయన గట్టిగా వాదించారు. ఈ బిల్లును వెంటనే అమలు చేయకుండా జనాభా గణన (సెన్సస్), నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే అమలు చేస్తామని చెప్పడంపైనా విపక్షాలు అభ్యంతరం తెలిపాయి. ప్రభుత్వం కావాలనే కాలయాపన చేస్తోందని అఖిలేశ్ యాదవ్‌తో పాటు ఇతర ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం కాగా, ఓబీసీ, ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా లేకపోవడమే ప్రస్తుత వివాదానికి కేంద్ర బిందువుగా మారింది.

**మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన అసదుద్దీన్ ఒవైసీ**

పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లును మజ్లిస్ పార్టీ వ్యతిరేకించింది. పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ఈ రోజు మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టింది. సభలో వివిధ పార్టీలు డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకించాయి. మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించారు.
ఈ బిల్లును నిరసిస్తూ ఆయన సాహిర్ లుధియాన్వి రాసిన ఒక కవితను లోక్ సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ బిల్లును సభలో ప్రవేశపెట్టడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ చర్య మహిళా రిజర్వేషన్‌కు సంబంధించినది కాదని, ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచివేసే చర్య అని ఆరోపించారు. ఈ బిల్లు జనాభా ఎక్కువగా ఉన్నరాష్ట్రాలకు మరింత అధికారం ఇస్తుందని అన్నారు.
డీలిమిటేషన్ బిల్లుపై ఆయన మాట్లాడుతూ, బిల్లు ప్రజాస్వామ్య, సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఉందని విమర్శించారు. దక్షిణాది ప్రాంతాలకు సభలో ప్రాతినిథ్యం లేకుండా ఈ బిల్లు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, డీలిమిటేషన్ బిల్లును కాంగ్రెస్, ఎస్పీ, డీఎంకే సహా వివిధ పార్టీలు వ్యతిరేకించాయి.

## గృహిణులకు రూ.2,500, నిరుద్యోగులకు రూ.4,000...
## భారీ హామీలతో 'టీవీకే' మానిఫెస్టో ఆవిష్కరించిన విజయ్

నటుడి నుంచి రాజకీయ నేతగా మారిన విజయ్, తన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీని రాబోయే ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా, భారీ సంక్షేమ పథకాలు, టెక్నాలజీ ఆధారిత పాలన హామీలతో కూడిన పార్టీ మేనిఫెస్టోను గురువారం సాయంత్రం విడుదల చేశారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా, సామాజికంగా పునర్నిర్మించేందుకు రంగాలవారీగా సంస్కరణలు చేపడతామని ప్రకటించారు. సంప్రదాయ సంక్షేమ పథకాలతో పాటు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతను పాలనలో ప్రవేశపెట్టడం ద్వారా వినూత్న మార్పునకు శ్రీకారం చుడతామని విజయ్ స్పష్టం చేశారు.ప్రజాకర్షక పథకాలకు మేనిఫెస్టోలో పెద్దపీట వేశారు. గృహిణులకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులకు రూ.4,000, డిప్లొమా హోల్డర్లకు ?2,500 భృతి అందిస్తామని హామీ ఇచ్చారు. యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఐదు లక్షల మందికి రూ.18,000 చొప్పున ఉపాధి ఆధారిత మద్దతు పథకాన్ని ప్రకటించారు. దీంతో పాటు, ఇంటర్న్‌షిప్ చేసే యువతకు రూ.5,000 నుంచి రూ.8,000 వరకు స్టైఫండ్ ఇస్తామని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అందించే పింఛనును నెలకు రూ.3,000కు పెంచుతామని, దాదాపు 15 లక్షల మందికి ఈ ప్రయోజనం చేకూరుస్తామని పేర్కొన్నారు.మహిళా సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, పేద యువతుల వివాహానికి ఒక సవర బంగారం, పట్టు చీరతో కూడిన ఆర్థిక సహాయం అందిస్తామని వాగ్దానం చేశారు. ప్రభుత్వ భూముల్లో అర్హులైన వారికి ఉచితంగా ఇంటి పట్టాలు ఇస్తామన్నారు.
ఆరోగ్య రంగంలో ఉచిత వైద్య పరీక్షలు, తక్కువ ధరలకే మందులు, క్యాన్సర్ బాధితుల కోసం ప్రత్యేక బీమా సౌకర్యం కల్పిస్తామని టీవీకే హామీ ఇచ్చింది. ప్రాథమిక సేవలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ, ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు, ఏడాదికి ఆరు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేస్తామని ప్రకటించారు. రైతులకు అండగా నిలుస్తూ, ఐదు ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతుల రుణాల్లో 50 శాతం మాఫీ చేస్తామని, సౌరశక్తి ప్రాజెక్టులను ప్రోత్సహిస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచారు. మత్స్యకారులకు కనీస మద్దతు ధర, చేపల వేట లేని సమయంలో రూ.27,000 ఆర్థిక సహాయం, రూ.25 లక్షల బీమా కవరేజీ కల్పిస్తామన్నారు.ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి అంగన్‌వాడీ సిబ్బందికి రూ.18,000, పారిశుద్ధ్య కార్మికులకు రూ.10,000 వేతనం, దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు రూ.15 లక్షల ప్రయోజనం కల్పిస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్రంలో శాంతిభద్రతలకు ప్రాధాన్యత ఇస్తూ, "డ్రగ్-ఫ్రీ తమిళనాడు" కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని విజయ్ ప్రకటించారు. ఆర్థికంగా, 2036 నాటికి తమిళనాడును 1.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం రూ.15,000 కోట్లతో భద్రతా నిధిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ మేనిఫెస్టో ద్వారా సంక్షేమ పథకాలను, టెక్నాలజీ ఆధారిత అభివృద్ధిని జోడించి ఏప్రిల్ 23న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు టీవీకే సిద్ధమవుతోంది.

## జగన్ బతుకే ఒక అరాచకం

వైసీపీ అధినేత జగన్ నిన్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యల పట్ల మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో స్పందించారు. జగన్ బతుకే ఒక అరాచకమని, ఆయనకు అభివృద్ధి చేయడం తెలియదని, గొడ్డలి రాజకీయమే తెలుసని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుండటాన్ని చూసి ఓర్వలేకే జగన్ కులాల మధ్య చిచ్చుపెట్టి అల్లర్లు సృష్టించాలని చూస్తున్నారని ఆరోపించారు. గురువారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ విషయంలో జగన్ దుష్ప్రచారం చేస్తున్నారని రవీంద్ర మండిపడ్డారు. "ఐదేళ్ల పాటు నిధులు, బిల్లులు ఇవ్వకుండా హార్బర్ నిర్మాణాన్ని అడ్డుకుని, మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసింది జగన్. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు వేగవంతం చేసి, 901 మీటర్ల జెట్టీ, కోల్డ్ స్టోరేజ్‌లతో ఆధునిక హార్బర్‌గా పూర్తి చేస్తుంటే.. మత్స్యకారులను రెచ్చగొట్టేలా అసత్యాలు మాట్లాడుతున్నారు" అని విమర్శించారు.

**దేశ రక్షణ సంస్థపై జగన్ వైఖరి దుర్మార్గం**

జువ్వలదిన్నెలో దేశ రక్షణకు కీలకమైన 'సాగర్ డిఫెన్స్' సంస్థకు కేంద్ర అనుమతితో భూమి కేటాయిస్తే, దానిని తరిమికొడతాననడం జగన్ దుర్మార్గపు ఆలోచనకు నిదర్శనమని కొల్లు రవింద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "తల్లి, చెల్లిని వెళ్లగొట్టారు, సొంత బాబాయినే వేసేశారు. ఇప్పుడు దేశ రక్షణ సంస్థను కూడా తరిమికొడతానంటున్నారు. అంటే జగన్‌కు దేశం మీద కూడా భక్తి లేదు. ఆయనకు తెలిసింది గొడ్డలి పార్టీ, గొడ్డలి గుర్తు.. నరుక్కుంటూ పోవడమే" అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

**అభివృద్ధి, పెట్టుబడులకు జగన్ శత్రువు**

గత ఐదేళ్లలో 800 పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమికొట్టిన చరిత్ర జగన్‌దని రవింద్ర ఆరోపించారు. "కియా, అమరరాజా వంటి సంస్థలను బెదిరించి పొరుగు రాష్ట్రాలకు పంపారు. ఇప్పుడు చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి వస్తుంటే చూసి ఓర్వలేకపోతున్నారు. నేను వస్తే చట్టాలు మార్చేస్తానంటూ పెట్టుబడిదారులను మళ్లీ భయపెట్టాలని చూస్తున్నారు. విధ్వంసమే నైజంగా ఉన్న జగన్‌ను ప్రజలు నమ్మకే 11 సీట్లకు పరిమితం చేశారు" అని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, జీవో 217ను రద్దు చేసి, వేట నిషేధ భృతిని పెంచి, వారికి అండగా నిలుస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

**తమిళనాడు బోట్ల విడుదల అంశంలో జగన్ దుష్ప్రచారం**

తమిళనాడు మత్స్యకారుల బోట్లను పట్టుకున్న తర్వాత, వాటిని యువనేత నారా లోకేశ్ చెప్పడం వల్లే పోలీసులు విడుదల చేశారని జగన్ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం, దురదృష్టకరం అని కొల్లు రవీంద్ర కొట్టిపడేశారు. ఈ అంశాన్ని రాజకీయంగా మార్చి లబ్ది పొందాలని జగన్ ప్రయత్నించడం బాధాకరమని అన్నారు. వాస్తవానికి, ఈ బోట్ల విషయంలో స్థానిక గ్రామాల ప్రజలు జోక్యం చేసుకున్నారని వెల్లడించారు. "ఇది మా గ్రామాల మధ్య ఉన్న సమస్య. మేమే చర్చించుకుని పరిష్కరించుకుంటాం" అని వారు కోరారని తెలిపారు. వారి అభిప్రాయాన్ని, ఐక్యతను గౌరవిస్తూ, వారి నిర్ణయం ప్రకారమే మేము ముందుకు వెళ్లాం... అంతేకానీ, ఇందులో లోకేశ్ గారి ప్రమేయం ఉందనడం పచ్చి అబద్ధం అని కొల్లు రవీంద్ర వివరించారు."నిజానికి, సముద్ర గస్తీ విషయంలో గత జగన్ ప్రభుత్వ హయాంలోనే తీవ్ర నిర్లక్ష్యం జరిగింది. 2017 వరకు ఇతర రాష్ట్రాల బోట్లు రాకుండా మెరైన్ బోట్లు గస్తీ కాస్తుండేవి. కానీ 2019 తర్వాత ఆ గస్తీ పూర్తిగా నిలిచిపోయింది. బోట్ల రిపేర్లు, మెయింటెనెన్స్‌కు నిధులు ఇవ్వకపోవడం, సిబ్బందిని తొలగించడం వంటి చర్యలతో సముద్ర సరిహద్దులు బలహీనపడ్డాయి. ఆ కారణంగానే తమిళనాడు బోట్లు మన సముద్ర జలాల్లోకి చొరబడి మత్స్య సంపదను దోచుకుపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని గుర్తించిన వెంటనే చంద్రబాబు నాయుడు గారు, నారా లోకేశ్ గారు అధికారులను అప్రమత్తం చేశారు. తక్షణమే 650 హార్స్ పవర్ ఇంజిన్లతో కూడిన స్పీడ్ బోట్లను ఏర్పాటు చేసి గస్తీని పటిష్టం చేశాం. అక్రమంగా ప్రవేశిస్తున్న బోట్లను నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాం.
వాస్తవాలు ఇలా ఉంటే, జగన్ మాత్రం నిజాన్ని దాచిపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు" అని కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు.

## మహిళా బిల్లుతో దేశ రాజకీయాల దిశ, దశ మారతాయి

మహిళా రిజర్వేషన్ బిల్లు దేశ రాజకీయాల దిశ, దశను మార్చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ జనాభాలో సగభాగమైన మహిళలు నిర్ణయాధికార ప్రక్రియలో పాలుపంచుకోవడం ద్వారా దేశానికి కొత్త దిశానిర్దేశం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కీలక బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు.
కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్... రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026, డీలిమిటేషన్ బిల్లు, 2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, 2026లను సభ ముందు ఉంచారు. అయితే, ఈ బిల్లును ప్రవేశపెట్టే సమయంలో విపక్షాలు మూజువాణి ఓటింగ్‌ను అంగీకరించలేదు. ఓట్ల విభజన (డివిజన్)కు పట్టుబట్టడంతో సభలో ఓటింగ్ నిర్వహించాల్సి వచ్చింది.బిల్లు ప్రవేశపెట్టడానికి అనుకూలంగా 251 ఓట్లు, వ్యతిరేకంగా 185 ఓట్లు పోలైనట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సాధారణంగా లోక్‌సభలో మూజువాణి ఓటు ద్వారానే తీర్మానాలు ఆమోదిస్తారు. కానీ, ఫలితంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పుడు సభ్యుల కోరిక మేరకు డివిజన్ నిర్వహిస్తారు. ఆటోమేటిక్ ఓట్ రికార్డర్ వ్యవస్థ ద్వారా ఈ ప్రక్రియను పూర్తిచేశారు. ఆ తర్వాత ఓటు స్లిప్పుల ద్వారా జరిగిన ఓటింగ్‌లో మొత్తం 333 మంది సభ్యులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, పార్టీలు ఈ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని విజ్ఞప్తి చేశారు. వికసిత భారత్ ఏ2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో మహిళా రిజర్వేషన్లు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. గతంలో ఈ బిల్లును వ్యతిరేకించిన వారికి మహిళా ఓటర్లు తగిన గుణపాఠం చెప్పారని ఆయన వ్యాఖ్యానించారు.

## రేవంత్ రెడ్డి వాదన విని తెలంగాణ ప్రజలు నవ్వుతున్నారు

డీలిమిటేషన్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వితండవాదం చేస్తున్నారని, ఆయన చెబుతున్నది విని తెలంగాణ ప్రజలు కూడా నవ్వుతున్నారని బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య అన్నారు. రాష్ట్రాల జీఎస్‌డీపీ ఆధారంగా లోక్ సభ సీట్ల సంఖ్యను పెంచాలన్న రేవంత్ రెడ్డి ప్రతిపాదనపై ఆయన మండిపడ్డారు. సీట్ల పెంపునకు, జీఎస్‌డీపీ ముడిపెట్టాలన్న తెలంగాణ సీఎం సలహా అత్యంత మూర్ఖంగా ఉందని అన్నారు. అసలు ఆయనకు ఆ సలహా ఎవరిచ్చారో కానీ అందరూ నవ్వుతున్నారని చురక అంటించారు. లోక్ సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న విపక్ష పార్టీలు, దక్షిణాది పార్టీల వ్యాఖ్యలను సూర్య తప్పుబట్టారు. డీలిమిటేషన్‌పై విపక్షాల వాదన అర్థరహితంగా ఉందని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని హామీ ఇచ్చారు. డీలిమిటేషన్‌పై ప్రతిపక్షాలు దక్షిణాది రాష్ట్రాల ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాల ఆదాయం అనేది ప్రతి సంవత్సరం మారుతుందని తెలిపారు. దానిని డీలిమిటేషన్‌కు ప్రాతిపదికగా తీసుకోవాలని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. ఆదాయం ప్రకారం ఓట్లు లేదా ప్రాతినిధ్యం ఇవ్వాలనుకుంటే దేశంలో అత్యధిక ఆదాయం ఉన్న అంబానీకి లక్ష ఓట్లు ఇవ్వవలసి వస్తుందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వాలు మహిళా రిజర్వేషన్ బిల్లును పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పుడు కూడా మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడానికే చూస్తున్నాయని అన్నారు. డీలిమిటేషన్‌ను సాకుగా చూపి మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వేగంగా అమలు చేద్దామంటే విపక్షాలు యూటర్న్ తీసుకుంటున్నాయని అన్నారు.కాంగ్రెస్ నాడు అత్యంత దారుణంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలను విభజించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ చేసిన విభజన బ్రిటిష్ వారి కంటే దారుణంగా ఉందని అన్నారు. ఏపీ, తెలంగాణ విభజనను కాంగ్రెస్ పాకిస్థాన్, భారత్ విభజనతో పోల్చారు. విభజన సమయంలో కాంగ్రెస్ అనుసరించిన విధానం వల్ల రెండు రాష్ట్రాల మధ్య నేటికీ ఘర్షణ వాతావరణం నెలకొందని ఆన్నారు.

## నారీ శక్తి చట్టం చరిత్రాత్మకం

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తీసుకువచ్చిన 'నారీ శక్తి వందన్ అధినియం సవరణ బిల్లు' ఒక చరిత్రాత్మక ముందడుగు అని ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా పాలనలో వారికి సముచిత స్థానం దక్కుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా సాధికారతకు జనసేన పార్టీ మాటలతో కాకుండా చేతలతో ఎప్పుడూ మద్దతుగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్న పవన్ కల్యాణ్, "2019 ఎన్నికల్లో మేము వాగ్దానం చేసినట్లుగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల పట్ల మా నిబద్ధత, సమాన అవకాశాలు, సరైన ప్రాతినిధ్యంపై మాకున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది" అని తెలిపారు. మహిళలు సమాజానికి పునాది అని, కుటుంబాలను తీర్చిదిద్దడం నుంచి దేశ నిర్మాణంలో పాలుపంచుకోవడం వరకు వారి పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. "మహిళ ఎదిగితే దేశం ఎదుగుతుంది. ఇది వారికి కొత్త హక్కులు ఇవ్వడం కాదు, వారికి న్యాయంగా చెందాల్సిన వాటిని తిరిగి ఇవ్వడం. బలమైన మహిళలు బలమైన కుటుంబాలను నిర్మిస్తారు. బలమైన కుటుంబాలు బలమైన దేశాన్ని నిర్మిస్తాయి. ఇకపై 'నారీ శక్తి' కేవలం నినాదం కాదు, మన నాగరికతకు బలంగా నిలుస్తుంది. న్యాయమైన, సమానమైన, సాధికారత కలిగిన భారతదేశాన్ని నిర్మించడానికి ఈ స్ఫూర్తితో ముందుకు సాగుదాం" అని పవన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న భారత మహిళల విజయాలను ఆయన కొనియాడారు. సైప్రస్‌లో జరిగిన ఉమెన్స్ క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో గెలిచి, ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌కు సవాల్ చేసే హక్కును పొందిన తొలి భారతీయ మహిళగా ఆర్. వైశాలి చరిత్ర సృష్టించడాన్ని ప్రస్తావించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఇస్రో శాస్త్రవేత్త రీతూ కరిధాల్ నుంచి ఒలింపిక్స్‌లో పీవీ సింధు, మీరాబాయి చాను, బాక్సింగ్‌లో నిఖత్ జరీన్ వరకు ఎందరో మహిళలు దేశానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన దాక్షాయణి వేలాయుధన్, హంసా మెహతా, దుర్గాబాయి దేశ్‌ముఖ్, విజయలక్ష్మీ పండిట్, రాజకుమారి అమృత్ కౌర్ వంటి వారి సేవలను పవన్ గుర్తు చేసుకున్నారు. "ప్రతిభకు అవకాశం తోడైనప్పుడు, మహిళలు నాయకత్వం వహిస్తారు, రాణిస్తారు, దేశాలకు స్ఫూర్తిగా నిలుస్తారని ఈ విజయాలన్నీ నిరూపిస్తున్నాయి" అని ఆయన పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల పనులు ఇకపై ఎస్ఎంసీలకే...

- మొదటి పేజి తరువాయి

మౌలిక సదుపాయాలకు సంబంధించిన చిన్న పనులను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు అప్పగించి వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఉన్నతాధికారులతో అమరావతిలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 3 స్టార్ మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెయ్యి మందికి పైగా విద్యార్థులున్న 60 పాఠశాలల్లో 5 స్టార్ సౌకర్యాలు ఏర్పాటు చేయడంపై దృష్టి సారించాలన్నారు. లీక్ ప్రూఫ్ భవనాలు, తాగునీరు, టాయిలెట్లు, పెయింటింగ్ వంటి పనులను ఎస్ఎంసీలకే అప్పగించాలని సూచించారు. అయితే, మోడల్ ప్రైమరీ స్కూళ్లలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను మాత్రం రాష్ట్ర పాఠశాల మౌలిక సదుపాయాల సంస్థ ద్వారానే చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని లోకేష్ ఆదేశించారు. ఇందుకోసం 'డోర్ టు డోర్' క్యాంపెయిన్ నిర్వహించాలని, ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ ఏడాది 10 శాతం అడ్మిషన్ల పెరుగుదలను లక్ష్యంగా పెట్టుకోవాలని, డ్రాపవుట్లను సున్నా స్థాయికి తీసుకురావాలని స్పష్టం చేశారు.

# నారి శక్తి ప్రోగ్రాంను విజయవంతం చేయండి

## జిల్లా కలెక్టర్ విజయ సునీత



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఏప్రిల్ 16**

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లు శుక్రవారం పార్లమెంట్లో ఆమోదం పొందనున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించబోయే 'నారీ శక్తి ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గురువారం ఆమె జిల్లాలోని ఆర్డీవో లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవో, తాహసిల్దార్లు , ఐసిడిఎస్, డ్వామా అధికారులతో కలెక్టర్ కార్యాలయం నుంచి గూగుల్ మీట్ నిర్వహించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని మహిళా మణులతో ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గానికి వెయ్యి నుంచి 2వేల మంది కార్యక్రమానికి హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రత్యేక సాంస్కృతి కార్యక్రమాలు సైతం ఏర్పాటు చేయాలని తెలిపారు.

పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

## నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టిన

# ప్రకాశం జిల్లా పోలీసులు

- లాడ్జీలు, బస్టాండ్‌లలో పోలీసుల తనిఖీలు
- చట్ట వ్యతిరేక/అసాంఘిక కార్యకలాపాలకు తావిస్తే చట్ట పరమైన చర్యలు
- రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ సురక్షితంగా గమ్యం చేరండి
- లాడ్జి, హోటల్స్ అనుమానాస్పదంగా అన్పిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి





**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 16**

శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, చట్ట విరుద్ధ కార్యకలాపాలను అరికట్టడమే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, కందుకూరు డీఎస్పీ బాల సుబ్రహ్మణ్యం సూచనలతో కందుకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ అన్వర్ బాషా ఆధ్వర్యంలో కందుకూరు టౌన్ ఎస్సై నాగరాజు, కందుకూరు రూరల్ ఎస్సై బాలకృష్ణ, ఉలవపాడు ఎస్సై సుబ్బారావు స్పెషల్ పార్టీ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కందుకూరు పట్టణంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానిత ప్రదేశాలు, అనుమానిత వ్యక్తుల గృహాలు, పార్సెల్ ఆఫీసుల్లో తనిఖీలు చేశారు. గంజాయి ఇతర మాదక ద్రవ్యాల నిల్వ, విక్రయా లపై ప్రత్యేక దృష్టి సారిస్తూ తనిఖీలు కూడా నిర్వహించారు. అదేవిధంగా ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాలైన ఆర్టీసీ బస్టాండ్ ముఖ్య కూడళ్ల వద్ద తనిఖీలు నిర్వహించి, అక్కడ ఉన్న అనుమానిత వ్యక్తులు వస్తువులను పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించి, వారి వేలిముద్ర లను ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ ద్వారా తనిఖీ చేయటం నేర నియంత్రణకు జిల్లా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుం టున్నారు. అలాగే పట్టణంలోని లాడ్జీలను తనిఖీ చేసి, లాడ్జ్ యజ మానులకు బస చేసే వ్యక్తుల ఆధార్ కార్డులు ఇతర వివరాలను నమోదు చేసే విధంగా సరైన రిజిస్టర్ నిర్వహిం చాలని సూచించారు. రికార్డులు నిర్వహించని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టవిరుద్ధంగా గదులు ఇవ్వరాదని, అనుమానాస్పద వ్యక్తులు బస చేసినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.తదుపరి, కందుకూరు పట్టణానికి వచ్చే ప్రధాన మార్గాలలో వాహనాల తనిఖీలు నిర్వహించి, హెల్మెట్ లేకుండా లేదా సరైన పత్రాలు లేని వాహనదారులపై చర్యలు తీసుకొని రూ. 25,000 జరిమానా విధించారు.ఈ సందర్భంగా కందుకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ అన్వర్ బాషా మాట్లాడుతూ కందుకూరు పరిధిలో అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనించినప్పుడు లేదా ఏదైనా అసాంఘిక కార్యక్రమాలు జరిగిన వెంటనే పోలీసులకు,డయల్ -112 సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సాధ్యమైనంత వరకు అందరూ కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి అని ప్రజలకు తెలియజేశారు.

## మార్కాపురం పట్టణంలో

# కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

### పన్ను వసూళ్ల నిర్లక్ష్యంపై మున్సిపల్ సిబ్బంది పై మండిపాటు



**మార్కాపురం రూరల్ పెన్ పవర్ ఏప్రిల్ 16**

మార్కాపురం పట్టణంలో జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్ళి కౌన్సిల్ ఛాంబర్, కార్యాలయ ఆవరణను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఛాంబర్ కు వెళ్లి రికార్డులను పరిశీలించి, పన్ను వసూళ్ల తీరు పై అసహనం వ్యక్తం చేశారు.గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం వసూలు పూర్తిగా తగ్గిపోయాయన్నారు. ఈ విషయంలో మున్సిపల్ సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. ప్రతినెల సచివాలయం సిబ్బంది కి టార్గెట్లు ప్రకటించి తనకు రిపోర్టు పంపాలని కమిషనర్ ను ఆదేశించారు. అనంతరం పట్టణంలోని 16వ సచివాలయానికి చేరుకొని అక్కడ సైతం రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. పన్ను వసూళ్ల లో నిర్లక్ష్యం చేయకుండా ముందుకు సాగాలన్నారు.అక్కడి నుంచి ఎస్ వి కె పి కళాశాల నుంచి మార్కెట్ యార్డ్ వరకు రోడ్డు మధ్యలో నాటిన మొక్కలను పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అదేవిధంగా ఎండిపోయిన మొక్కలు స్థానంలో కొత్త వాటి నాటాలన్నారు. అనంతరం తర్లుపాడు రోడ్డు లోని నీటి ట్యాంక్ వద్దకు వచ్చి... నీటి శుద్ధి కేంద్రాలు లు, ఫిల్టర్ బెడ్ల ను పరిశీలించారు. నీటి పంపింగ్, నీటి నాణ్యత పరీక్షల విధానాన్ని మున్సిపల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వేసవి లో లేకేజి ల సమస్యలు లేకుండా స్వచ్ఛమైన నీటిని పట్టణ ప్రజలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, ఏఈ భూపాల్ రెడ్డి, సర్వేయర్ సంజీవయ్య, ఇతర మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

# స్వీయ గణనలో ప్రతి ఒక్కరు కుటుంబ వివరాలు నమోదు చేసుకోవాలి

## -మంత్రి బాల వీరాంజనేయ స్వామి



**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం ఏప్రిల్ 16:**

జనగణన-2027 ప్రక్రియ 'స్వీయ గణన కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ కుటుంబ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పిలుపు నిచ్చారు. గురువారం ఉదయం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టంగుటూరు మండలం, తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు ఆధ్వర్యంలో స్వీయ గణన కింద తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భారత ప్రభుత్వ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, జనగణన-2027 ప్రక్రియలో భాగంగా జిల్లాలో మొదటిసారిగా స్వీయ గణన కార్యక్రమంలో భాగంగా వివిధ వర్గాల ప్రజలు తామే స్వయంగా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకునేందుకు వీలుగా ఏప్రిల్ 16 నుండి ఏప్రిల్ 30 వరకు 15 రోజుల పాటు షెడ్యూల్ జారీ చేయడమైనదన్నారు. అందులో భాగంగా ఈ రోజు నేను స్వయంగా జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు ఆధ్వర్యంలో స్వీయ గణన కార్యక్రమం నిర్వహణలో భాగంగా మా కుటుంబ వివరాలను నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. ప్రకాశం జిల్లా లోని గ్రామీణ ప్రాంతంలో 2412 బ్లాకులుగా, పట్టణ ప్రాంతంలో 845 బ్లాకులుగా మొత్తం 3255 బ్లాకుల్లో జనగణన కార్యక్రమం జరుగు తుందని, అందుకు గాను క్షేత్ర స్థాయి సిబ్బందిని నియమించడంతో పాటు వీరికి శిక్షణ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. మే 1వ తేదీ నుండి నెల రోజుల పాటు ఎన్యుమరేటర్స్ వచ్చి ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలు నమోదు చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ జనగణనలో ఎ కుటుంబం మిస్ కాకుండా చూడాలని, ఈ విషయమై ఎన్యుమరేటర్స్ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలు అందుబాటులో వున్న సమయాన్ని ఎన్యుమరేటర్స్ కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా ఈ జనగణన కార్యక్రమానికి సహకరించి తమ వివరాలను తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు మండల తహసిల్దార్ ఆంజనేయులు, జనగణన నమోదు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గుడ్ మార్నింగ్ కందుకూరు

## -పట్టణంలో 2వ రోజు ఎమ్మెల్యే క్షేత్రస్థాయి పర్యటన





**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 16**

పట్టణంలోని 13వ వార్డు బండపాలెం, రామ్ నగర్, ఆనందపురం రోడ్డు14వ వార్డు శ్రీనగర్ కాలనీ 16వ వార్డు అజ్మల్ హుస్సేన్ హాస్పిటల్, ముళ్ళపాలెం ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం ఉదయం పర్యటించారు. మున్సిపల్ కమిషనర్ అనూష, పార్టీ నేతలతో కలిసి ఆయా వార్డుల్లో ప్రతిరోడ్డు, ప్రతి కాలువను నిశితంగా పరిశీలించారు. కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండడం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడం, కాలువలపై ఆక్రమణలు, మరికొన్నిచోట్ల కాలువలు పూడిపోవడాన్ని ఎమ్మెల్యే గమనించి అధికారులపై మండిపడ్డారు. ఉద్యోగాలు ఇలాగేనా చేసేది ? ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా ? ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్నప్పుడు, సౌకర్యాలు కల్పించాలి కదా ! అంటూ క్లాస్ తీసుకున్నారు.ఎమ్మెల్యే స్థానికులతో మాట్లాడుతున్న సందర్భాల్లో పారిశుద్ధ్య సిబ్బంది పనితీరు సరిగా లేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని కాలువలు నెలకొకసారి కూడా శుభ్రం చేయడం లేదన్నారు. దీంతో స్థానికుల ఎదుటే, అధికారులను ఎమ్మెల్యే నిలదీశారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి, కనీసం 10 రోజులకు ఒకసారి ప్రతి కాలువ శుభ్రం చేయాలని సూచించారు.పలుచోట్ల కాలువలపై మెట్లు, బంకులు, ఇతర నిర్మాణాలను గమనించిన నాగేశ్వరరావు వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఒకవైపు కాలువలు ఆక్రమించడమే కాకుండా, వ్యర్థాలన్నీ అందులో పారబోస్తే ఎలా? మున్సిపాలిటీ సుందరంగా ఉండాలంటే మీరందరూ తప్పక సహకరించాలి అని ఆక్రమణదారులను ఎమ్మెల్యే సున్నితంగా మందలించారు. 16వ వార్డు అజ్మల్ హుస్సేన్ హాస్పిటల్, ముళ్లపాలెం, సిపాయిపాలెం ప్రాంతాల్లో చాలా ఏళ్ల క్రితం నిర్మించిన సైడ్ కాలువలు, ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. పైగా ఇటుకలతో నిర్మాణం వల్ల చాలా చోట్ల దెబ్బతిని మురికి నీరు నిల్వ ఉంటుంది. రోడ్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్నాయి. వీటన్నిటిని పరిశీలించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు వాటి స్థానంలో కొత్తవి నిర్మించేందుకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ ను ఆదేశించారు. పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, వార్డు అధ్యక్షులు ఖలీల్, యల్లంటి మాల్యాద్రి, మోసంగి ప్రసాద్, పరిటాల రామకృష్ణ, క్లస్టర్ ఇంచార్జి వడ్డెళ్ళ రవిచంద్ర, పార్టీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీను, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి కూనం నరేంద్ర, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీను, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, పార్టీ నేతలు పులి నాగరాజు, తలతోటి మస్తాన్, కోటపూరి శ్రీను, జక్కుల రవీంద్ర, శ్రావణ్, బాషా, అబ్దుల్లా, సుభాని, షకీల్, మునాఫ్, కాకుమాని మాల్యాద్రి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.





# చక్రాయపాలెం వద్ద కారు బీభత్సం

## ఇద్దరు దుర్మరణం -ఒకరి పరిస్థితి విషమం

**అద్దంకి ఆర్.సి(పెన్ పవర్) ఏప్రిల్ 16**

అద్దంకి మండల పరిధిలోని చక్రాయపాలెం సమీపంలో గురువారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. అతివేగంగా దూసుకొచ్చిన కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను బలంగా ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, మరొకరు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. అద్దంకి పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన కోటికలపూడి. శ్రీను (35) తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. శ్రీను గతంలో వాలంటీర్‌గా పనిచేసి అందరికీ సుపరిచితులు కావడంతో ఈ వార్త స్థానికంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయనతో పాటు గుంటూరుకు చెందిన షేక్. సాంబయ్య (37) కూడా ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మరణించారు. ప్రమాద ధాటికి కారు, బైకులు నుజ్జునుజ్జు కావడంతో మృతదేహాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న దృశ్యం చూపరులను కలచివేసింది.

**రిమ్స్‌లో క్షతగాత్రుడి పరిస్థితి విషమం.**

రోడ్డు ప్రమాదంలో గుంటూరుకు చెందిన షేక్. రాజు (42) తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక ప్రజలు, 108 సిబ్బంది సమన్వయంతో బాధితుడిని అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం రక్తస్రావం అధికం కావడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్య వర్గాలు తెలిపాయి. విషయం తెలుసుకున్న అద్దంకి సీ.ఐ సుబ్బరాజు తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.



## జనగణనలో వివరాలు నమోదు చేసుకున్న ఎమ్మెల్యే




**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 16**

దేశవ్యాప్తంగా జనగణన గురువారం ప్రారంభమైన నేపథ్యంలో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు తన కుటుంబ వివరాలను సొంతగా నమోదు చేసుకున్నారు. జనగణన తొలిరోజున ప్రజా ప్రతినిధులతో వివరాలు చేస్తుండగా స్థానిక ఎమ్మెల్యేతో, జిల్లా రెవిన్యూ అధికారి ఓబులేసు కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురువారం నుంచి ఈ నెలాఖరు వరకు స్వీయ గణన జరుగుతుందని, వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఎన్యూమరేటర్లు ఇంటింటికి వచ్చి వివరాలు తీసుకుంటారని డిఆర్ఓ తెలియజేశారు.ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, 2027 సెన్సస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వ సిబ్బంది ఇళ్లకు వచ్చినప్పుడు, వారు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వాలన్నారు. అప్పుడే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో జరిగిన కార్యక్రమంలో తహసిల్దార్ కళ్యాణ్, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పలువురు నేతలు హాజరయ్యారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన





**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 16**

అగ్నిమాపక శాఖ వారోత్సవాలలో భాగంగా గురువారం గిద్దలూరు పట్టణంలో అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కల్పించారు. అగ్నిమాపక శాఖ అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వి మార్ట్ సూపర్ మార్కెట్ తో పాటు పలు అపార్ట్మెంట్లలో అగ్ని ప్రమాద నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. షార్ట్ సర్క్యూట్ , గ్యాస్ సిలిండర్లతో అగ్నిప్రమాదాలు వంటివి ఎలా ఎదుర్కోవాలో ప్రజలకు దృశ్య రూపంలో చూపించి అధికారులు వివరించారు. అలానే గోడు పత్రికలను అంటించి ప్రజలను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పశు సంపదతో ఆర్థిక అభివృద్ధి

### జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మురళీకృష్ణ



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 16**

పశు సంపదతోనే ఆర్థిక అభివృద్ధి సాధ్యపడుతుందని ప్రకాశం జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మురళీకృష్ణ చెప్పారు. గురువారం నాడు మండల కేంద్రమైన మర్రిపూడి గ్రామంలో జరిగిన పెయ్య దూడల ప్రదర్శన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో 55 గర్భకోశ ఉత్పత్తుల సభలు నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల బాల వీరాంజనేయ స్వామి ఆదేశాల మేరకు మేలు జాతి దూడల అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పశుపోషకులు కృత్రిమ గర్భకోష దూడల అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. అలాగే పశువుల అభివృద్ధి, సంరక్షణ కోసం పశుపోషకులు తీసుకోవాల్సిన జాగ్రత్తల చర్యల గురించి డాక్టర్ మురళీకృష్ణ అర్థమయ్యే రీతిలో వివరించారు. అనంతరం దూడల ప్రదర్శనలో పాల్గొన్న రైతులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్య శాఖ అధికారి డాక్టర్ మంచి కల మని శేఖర్, మాజీ జెడ్పిటిసి టి నరసింహారావు, తెలుగుదేశం నాయకులు ఎస్ యోగి రెడ్డి, సిహెచ్ నర్సారెడ్డి, సిహెచ్ రమణారెడ్డి, పశు సంవర్ధక శాఖ సిబ్బంది, పశు పోషకులు, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడిలో చదువుకో తలరాతను మార్చుకో

**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్16:**

ప్రభుత్వ బడిలో చదువుకో.. తలరాతను మార్చుకో అంటూ పట్టణంలోని అమలనాధుని వారిపాలెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు గురువారం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వీధుల్లో తిరిగి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈఓ లు ఎం. నాగకుమార శర్మ, కె. సుబ్బారెడ్డి లు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మనబడి – జ్ఞానబాట కార్యక్రమం పేరిట ఈ నెల 10 నుంచి 18 వ తేదీ వరకు విద్యావారోత్సవాలు నిర్వహిస్తుందన్నారు. విద్యార్థుల నమోదు శాతం పెంచడం, ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అన్నీ రకాల వసతులను కల్పించిందన్నారు. బడిఈడు పిల్ల లందరినీ ప్రభుత్వ బడుల్లో చేర్పించి వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక వసతులు, సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యమైన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అందిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ



పాఠశాలల్లోనే అర్హులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన అందుతుందని, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాల ముద్దు.. ప్రైవేట్ పాఠశాల వద్దు, ప్రభుత్వ బడి – అమ్మ ఒడి, సర్కారు బడి పిల్లలు సత్తా గలిగిన పిడుగులు, ప్రభుత్వ



బడి లో చేర్చు మీ పిల్లవాడి తలరాత మార్చు, ప్రభుత్వ పాఠశాలలు – మీ పిల్లల భవిత కు పునాదులు, మన ఊరు, మన బడిని మనమే కాపాడుకుందాం.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు





**పెన్ పవర్, కంభం ఏప్రిల్ 16**

కంభం మండలంలోని ఎన్ఆర్ తురిమెళ్ల ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి హాజరైన మండల విద్యాశాఖ అధికారులు టి. అబ్దుల్ సత్తార్ టి. శ్రీనివాసులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ నాయుడు పాత్ర కీలకమని పేర్కొన్నారు. పాఠశాల మౌలిక వసతుల మెరుగుదలతో పాటు విద్యా ప్రమాణాల పెంపుకు ఆయన తీసుకున్న చర్యలు ఆదర్శనీయమని కొనియాడారు. ఉపాధ్యాయురాలు జ్యోతిలక్ష్మమ్మ అమలు చేసిన ప్రత్యేక బోధనా విధానాలు విద్యార్థులలో నేర్చుకునే ఆసక్తిని పెంపొందించడమే కాకుండా వారి నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని ప్రశంసించారు. ఆమె శ్రద్ధ పట్టుదల వల్ల విద్యార్థులు వివిధ రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలను విద్యార్థులలో చదవడం, వ్రాయడం, గణిత నైపుణ్యాలను బలోపేతం చేయడంలో ఈ గుర్తింపు కీలకమని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు, పాటలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ అందరినీ మెప్పించారు. అనంతరం చదువులో, క్రీడల్లో మరియు ఇతర సహపాఠ్య కార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ వేడుకల్లో పలువురు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జీవనోపాధుల ప్రణాళికపై సర్వే పూర్తి చేయాలి

### ఏపిఎం లక్ష్మీనారాయణ





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 16**

మండలంలో ఈనెల 24 నుండి 30 వరకు జీవనోపాదుల ప్రణాళికపై సర్వే పూర్తి చేయాలని ఏపిఎం లక్ష్మీనారాయణ అన్నారు మండల కేంద్రంలోని సి.ఎస్.పురం వెలుగు కార్యాలయంలో గురువారం వార్షిక రుణ జీవనోపాధుల శిక్షణా కార్యక్రమం రెండవ రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈసీ సభ్యులు, ఈ నారి, సీఆర్పీలు, వీవోఏలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏపీఎం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 2026-27 సంవత్సరానికి సంబంధించిన జీవనోపాధుల ప్రణాళికలో ప్రతి గ్రామ సంఘంలో కనీసం 10 కొత్త, 5 పాత జీవనోపాధులను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 24 నుంచి 30 వరకు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.ముందుగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు గ్రామసభలు నిర్వహించి అవగాహన కల్పించాలని, కొత్త సభ్యుల నమోదు కూడా గ్రామసభ తీర్మానం ద్వారా జరగాలని చెప్పారు. సభ్యుల అవసరాలను గుర్తించి బ్యాంకులు, స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి వంటి వనరుల ద్వారా రుణాలు పొందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయిలో జీవనోపాధుల అభివృద్ధికి మార్గదర్శకత్వం లభిస్తుందని, మహిళా సంఘాలకు శిక్షణా కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం లక్ష్మీనారాయణ, సిసి లు ఐ మస్తాన్ రెడ్డి, టి కాశయ్య, యం వి నారాయణమ్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు బండారు సుబ్బమ్మ, అకౌంటెంట్ సువార్తమ్మ, వివోఏలు, ఎమ్మెస్ ఈసి, ఈనారీలు, సిఆర్పిలు పాల్గొన్నారు

# మహిళా బిల్లు.. చరిత్రత్మక మలుపు



**మార్కాపురం పెన్ పవర్ ఏప్రిల్ 16**

భారత ప్రజాస్వామ్య చరిత్రలో దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే 'నారీ శక్తి వందన్ అధినియం' ఒక చరిత్రాత్మక మలుపు అని బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ విజయలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ లో నారీ శక్తి వందన్ అధినియం పై బిజెపి మహిళలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు పెద్దపీటవేశారని అన్నారు. అనేక సంక్షేమ, సేవా కార్యక్రమాలు చేపట్టి దేశ ప్రజల హృదయాలలో నిలిచిపోతున్నారని చెప్పారు. భారత ప్రజాస్వామ్య చరిత్రలో దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే 'నారీ శక్తి వందన్ అధినియం' ఒక చరిత్రాత్మక మలుపు అన్నారు. ఇది కేవలం ఒక చట్టం మాత్రమే కాదని అబలలు సబలలుగా మారి, దేశ విధాన నిర్ణయాల్లో భాగస్వాములయ్యే సరికొత్త నవశకానికి నాంది అని తెలిపారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం అని అయితే జనాభాలో సగభాగంగా ఉన్న మహిళల ప్రాతినిధ్యం చట్టసభల్లో మాత్రం దశాబ్దాలుగా నామమాత్రంగానే ఉండిపోయిందని చెప్పారు.మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రయాణం ఒక సుదీర్ఘ పోరాటమాని దాదాపు 27 ఏళ్ల నిరీక్షణ తర్వాత ఇది చట్టంగా మారుతున్నడంతో ఆనందాన్ని కలిగిస్తుందని అన్నాడు. ఈ అసమానతను తొలగిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న మహిళా రిజర్వేషన్ బిల్లు భారత రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మారుస్తుందని ఆశాభవం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర నాయకురాలు షేక్ షబానా,బిజెపి సీనియర్ నాయకురాలు సరోజిని చెన్నకేశవ స్వామి ఆలయ బోర్డ్ మెంబర్ నారాయణమ్మ, బిజెపి మహిళ నాయకులు మద్దల లక్ష్మి,సిద్ధం కృష్ణవేణి, యాపర్తి సునీత, షేక్ హమీద, గొల్ల అపర్ణ,పూసల ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.



## మార్కాపూరము జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 18న ఏపీటీఫ్ ధర్నా జయప్రదం చేయండి

**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 16**

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కొరకు ఏప్రిల్ 18వ తేదీన జిల్లా కేంద్రమైన మార్కాపురం లో జరుగు ధర్నా కార్యక్రమం గిద్దలూరు జోన్ పరిధిలోని మూడు మండలాల ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని ఈ ధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని జోన్ కన్వీనర్ టి సుబ్బరాయుడు,జోన్ కో- కన్వీనర్ సిహెచ్ శ్రీనివాసులు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు జి శోభన్ బాబు కోరారు . ఏపీటీఎఫ్ డిమాండ్స్ : 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, నాలుగు విడతల పెండింగ్ డీఎ లను ప్రకటించాలి, 12వ పిఆర్సి కమీ షన్ నియమించాలి, ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగులకు రావలసిన సరెండర్ లీవ్ లను,పిఎఫ్, ఏపీ జి ఎల్ ఐ లోన్లు , క్లోజర్స్ ను వెంటనే చెల్లించాలి, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓ పి ఎస్ ను అమలుపరచాలి, ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్యలను పరిష్కరించాలి,ఉపాధ్యాయులను యాపుల నుండి విముక్తి చేయాలి, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని డిమాండ్స్ ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరం కోసం ధర్నా నిర్వహిస్తున్నామన్నారు.

## "వార్షిక రుణ జీవనోపాదుల సర్వే 2026- 27 పైన శిక్షణ కార్యక్రమం"





**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 16**

ఈరోజు పొదిలి వెలుగు , డి ఆర్ డి ఏ ఆఫీస్ నందు వార్షిక రుణ ప్రణాళిక మరియు జీవనాపాదులు 2026-27 పైన గ్రామ సంఘము ఓబీలకు,ఋూ లకు , ఈ నారీలకు ట్రైనింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. 2026 -27 ఆర్థిక సంవత్సరంలో గ్రూపు సభ్యులకు బ్యాంకు రుణాలు, శ్రీనిధి ,ఉన్నతి ,సిఐఎఫ్ రుణాలు కావాల్సిన వారికి ఈ జీవనోపాధిలా సర్వేలో నమోదు చేసుకోవాలి, ఇందులో నమోదు చేసుకున్న వారికి ఈ ఆర్థిక సంవత్సరంలో రుణాలు ఇవ్వడం జరుగుతుందని ఏపిఎం గోపాలకృష్ణ తెలపడం జరిగింది, ఏప్రిల్ 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రతి గ్రూపు సభ్యురాల వారీగా సర్వే నిర్వహించడం జరుగుతుందని, ప్రతి గ్రామంలో కనీసం 20 జీవనోపాదులు ఏర్పాటు చేయాలని తెలపడం జరిగింది. ఇందులో ఏపిఎం గోపాలకృష్ణ, సీసీలు దాసు, రాజయ్య , వెంకట రెడ్డి మండల సమైక్య అధ్యక్షురాలు మెహరున్నిషా బేగం,సెక్రెటరీ అరుణ, ట్రెజరీ సులోచన అకౌంటెంట్ శ్రీదేవి,శ్రీనిధి మేనేజర్ బాలు నాయక్ పాల్గొనడం జరిగింది.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

### ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 16**

నేడు శుక్రవారం ఉదయం 6:00 గం.ల నుండి 11:00 గంటల వరకు 132/33కేవీ గిద్దలూరు సబ్ స్టేషన్ సాంకేతిక మరమత్తుల కారణంగా గిద్దలూరు మండలంలోని అన్ని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలలోను, కొమరోలు మండలంలోని అన్ని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలలోను అలాగే రాచర్ల మండలంలోని యడవల్లి సబ్ స్టేషన్ పరిధిలో గల అన్ని గ్రామాలలో గృహ విద్యుత్, వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు. డి ఈఈ వై బి శేషగిరి ఒక ప్రకటనలో తెలిపారు .ఈ అసౌకర్యానికి చింతిస్తున్నాము. కావున ప్రజలు గమనించి సహకరించాలని ఆ ప్రకటంలో తెలిపారు.

# ప్రజల ప్రశంసలు అందుకుంటున్న స్కందపురి సేవా సమితి

## --స్కంధపురి సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ





**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 16**

స్కందపురి సేవా సమితి నిరంతరం చేస్తున్న సేవలకు ప్రజల నుండి ప్రశంసలు అందుకుంటుంది. స్కంధపురి సేవా సమితి ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేసి మండుటెండల్లో కష్టపడి పనిచేసి జీవనం కొనసాగిస్తున్న పేద ప్రజలకు, దాహంతో ఉన్న ప్రజలకు తాగు నీరు అందుస్తూ సేవలందిస్తున్నారు. స్కంద పుర సేవా సమితి చలివేంద్రాన్ని స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించి వారి సేవలను కొనియాడారు. అదే స్ఫూర్తితో దాతల సహాయంతో వారంలో దాదాపుగా 4 రోజులు చల్లని మజ్జిగ ఉచితంగా పంపిణీ చేస్తూ ప్రజలకు మరింత దగ్గరయ్యారు.అందులో భాగంగా గురువారం కొండముదుసుపాలెం గ్రామానికి చెందిన పొడపాటి రాజా అన్న పొడపాటి మహేంద్ర (మీ సేవ, ఎల్ఐసి ) కుమారుడు పొడపాటి సాయి వత్స ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 462 మార్కులు సాధించిన శుభసందర్భంలో స్కంధపురి సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే పుట్టినరోజులు జరుపుకునే వారు కూడా మా సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని వారు ఆహ్వానిస్తున్నారు. ఇలాగే ప్రతి ఒక్కరూ సేవా స్ఫూర్తితో మన స్కంధపురి లో భాగం కావాలని స్కంధపురి సేవా సమితి ఛైర్మెన్ పువ్వాడి మౌనిక తెలియచేశారు. ఇప్పటివరకు స్కందపురి సేవా సమితికి సహాయం చేసిన దాతలకు పువ్వాడి మౌనిక ధన్యవాదాలు తెలిపారు.

# జనగణన కార్యక్రమానికి అందరూ సహకరించాలి

### పొదిలి మున్సిపల్ కమిషనర్ మారుతి రావు



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 16**

పొదిలి నగర పంచాయతీ పరిధిలో జరుగు జన గణన కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పొదిలి మునిసిపల్ కమిషనర్ ఏ. మారుతి రావు కోరారు. గురువారం నాడు నగర పంచాయతీ పరిధిలో జనగణన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పొదిలి మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంస ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే మొట్టమొదటి స్వీయ గణన ను మార్కెట్ కమిటీ చైర్మన్ ఇమాంస నుండి ప్రారంభించారు. 2027 జనాభా లెక్కల కార్యక్రమంలో భాగంగా జన గణన కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని మునిసిపల్ కమిషనర్ మారుతి రావు చెప్పారు. స్వీయ గణన కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతి రావు తో పాటు, అడిషనల్ చార్జ్ ఆఫీసర్ వెంకటలక్ష్మి, కంప్యూటర్ ఆపరేటర్ గిద్యోను తదితరులు పాల్గొన్నారు.

# ఎ సి ఎల్ పి వార్షిక ప్రణాళిక పై శిక్షణ



**అర్ధవీడు , పెన్ పవర్, ఏప్రిల్ 16**

మండల కేంద్రంలోని అర్ధవీడు సచివాలయం నందు అర్ధవీడు క్లస్టర్ పరిధిలోని విఓఎలు, సి ఆర్ పిలు, ఈ నారీ లకు ఎసిఎల్ పి వార్షిక రుణ జీవనోపాధుల ప్రణాళికకు సంబంధించి గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సిసి శారద మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి అవసరమైన లబ్ధిదారులకు రుణాలు అందించేందుకు ఏప్రిల్ 16 నుండి సర్వే ప్రారంభించాలని సూచించారు. గ్రామ స్థాయిలో గ్రూపు సమావేశాలు నిర్వహించి రుణ జీవనోపాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. స్త్రీనిధి, ఉన్నతి, సిఐఎఫ్ మరియు బ్యాంకు రుణాలపై అవగాహన కల్పించారు .ప్రతి వివోల పరిధిలో కొత్తగా 10, పాతగా 5 జీవనోపాధులు ఉండే విధంగా మైక్రో క్రెడిట్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. ఈ శిక్షణ ద్వారా గ్రామస్థాయిలో రుణ జీవనోపాధుల అమలు సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివోఏలు, సీఆర్పీలు, ఈనారీలు పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఏప్రిల్ 17**

ఈనెల 20వ తేదీన మార్కాపురం పట్టణంలోని 'బి" కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా సంబంధించిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి జాబ్ మేళాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఉపాధి, ఉద్యోగాలు అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఎం. కంచిబాబు, తదితరులు పాల్గొన్నారు.



# అమలనాధునివారి పాలెంలో గ్రాడ్యుయేషన్ డే

**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 16**

మోడల్ ప్రైమరీ స్కూల్ అమలనాథుని వారి పాలెం లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. హరిణి ప్రజా వైద్యశాల డాక్టర్ మల్లికార్జున ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి వినూత్న కార్యక్రమాలు అమలు చేయడం ఇదే ప్రథమం అని పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందిని అభినందించారు. మండల విద్యాశాఖ అధికారి నాగ కుమార శర్మ మాట్లాడుతూ మనబడి జ్ఞనబాట ద్వారా ప్రభుత్వం ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తుందని బడి ఈడుగల పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించి నాణ్యమైన విద్య పొందవలసిందిగా తల్లిదండ్రులను కోరారు. మండల విద్యాశాఖ అధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందిస్తున్నారని విద్య కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేసిందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి బలోపేతం చేయాలని కోరారు. పాఠశాలలో ఐదవ తరగతి నుండి ఆరో తరగతికి ప్రమోట్ అయిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. పిల్లలందరూ చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఐదో తరగతిలో ఉత్తమ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 1500 రూపాయల నగదు బహుమతిని ఉపాధ్యాయురాలు శారదా దేవి ఇవ్వడం జరిగింది. అనంతరం ప్రధానోపాధ్యాయులు సుభాషిణి మాట్లాడుతూ విద్య యొక్క ఆవశ్యకత వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిఎల్ నరసింహం , కేవై కోటయ్య, ప్రసన్న కుమారి, సీఆర్ఎంటీ లు రమణారెడ్డి, ప్రతిభ, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అడవిరాజుపాలెం హైస్కూలులో ఉత్సాహంగా వార్షికోత్సవ వేడుకలు

### అలరించిన విద్యార్థుల నృత్య ప్రదర్శన





**గుడ్లూరు, పెన్ పవర్, ఏప్రిల్ 16**

మండలం పరిధిలో ఉన్న జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, అడవిరాజుపాలెం నందు వార్షికోత్సవం అంగరంగ వైభవంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రాజా అధ్యక్షతన గురువారం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు బి.హరే రామ్ మరియు ఎం.గోవర్ధన్ పాల్గొన్నారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గుండ్లపల్లి శివాజీ మరియు వైస్ ఛైర్మన్ అక్కిలిగుంట కుమారి లు కూడా ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మనోహరం మరియు ఉపాధ్యాయుల బృందం నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లో ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించినటు వంటి 20 మంది విద్యార్థిని విద్యార్థులకు గోల్డ్ మరియు సిల్వర్ మెడల్స్ ఇచ్చి అభినందించారు. స్పోర్ట్స్ అండ్ గేమ్స్ లో విశేష ప్రతిభ కనబరిచిన నలుగురు బాలబాలికలకు గోల్డ్ మరియు సిల్వర్ మెడల్స్ ను కూడా అందజేయడం జరిగినది. విద్యార్థిని విద్యార్థులు ఆనందోత్సవాల మధ్య ఉత్సాహంతో చేసిన డాన్సులు నృత్య ప్రదర్శన, కోలాటం ప్రదర్శనలు నిర్వహించి ఉపాధ్యాయులను, వారి తల్లిదండ్రులను ఎంతో ఆనందపరిచారు. దీనితో ఆ ప్రాంతం ఉత్సాహంతో, చిరునవ్వులతో నిండి, అందమైన వాతావరణాన్ని సృష్టించింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు విద్యార్థిని విద్యార్థులు సుమారుగా 400 మంది హాజరైనారు. ఈ కార్యక్రమం దిగ్విజయంగా విజయవంతం అవ్వడానికి, కార్యక్రమం నిర్వహించుటకు అవసరమైన ఆర్థిక సహాయం అందించిన గ్రామస్తులకు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల పిగిలి మనోహరం, రాజా (హెచ్ఎం), కె.వరలక్ష్మి, డి.బలరామయ్య, కే.సుధాకర్ రావు, కె.వెంకటేశ్వర్లు, సీహెచ్ వసంత కుమారి, జి.కొండయ్య, కె.శ్రీనివాసులు, పి.మాల్యాద్రి, ఆర్.రమణారావు, పి.మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.

# జనగణన శిక్షణా కార్యక్రమంను పరిశీలించిన ఆర్డీఓ శివరామిరెడ్డి

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 16**

మండల కేంద్రంలోని సి. ఎస్. పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన రెండవ రోజు జనగణన -- 2027 రెండవ బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని కనిగిరి ఆర్డీఓ శివరామిరెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు. గణాంక సేకరణ ప్రక్రియను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తూ శిక్షణ నిర్వహణ తీరుపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా ఇళ్ల జాబితా ట్రైనర్లు లక్కీపోగు అంతోని, గువ్వల బాలరాజు అందిస్తున్న శిక్షణ విధానం, సాంకేతిక అంశాలపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శిక్షణలో పాల్గొంటున్న ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లతో నేరుగా మాట్లాడి వారి అవగాహన, ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని పరిశీలించారు. జనగణన ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలు, పరిష్కార మార్గాలపై కూడా చర్చించారు.శిక్షణ కార్యక్రమం పై సంతృప్తి వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీకు కేటాయించిన గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని సూచించారు. జనగణన 2026 -2027 పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడుతుండటం వల్ల డేటా సేకరణలో పారదర్శకత ఉంటుందని, స్వీయ గణన సదుపాయం ఈ నెల 30వ తేదీ వరకు



అందుబాటులో ఉంటుందని, తదుపరి దశలో వచ్చే నెల 1 నుంచి 30 వరకు ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ప్రజలకు ముందుగానే అవగాహన కల్పించడం ద్వారా గణన ప్రక్రియను వేగవంతం చేయవచ్చని సూచించారు. జనగణన దేశ అభివృద్ధికి కీలకమైన సమగ్ర గణాంక ప్రక్రియ అని ప్రతి కుటుంబం సహారం ఎంతో అవసరం అని, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు సమన్వ యంతో పని చేస్తూ ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ ప్రసాద్, ఎంపీడీవో వి ప్రతాపరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో బ్రహ్మానందరెడ్డి, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, ఉపాధిహామీసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

### పొదిలి వెలుగు ఏపిఎం గోపాలకృష్ణ

**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 16**

మహిళలు ఆర్థికంగా ఎదగాలని పొదిలి వెలుగు ఏపిఎం గోపాలకృష్ణ కోరారు. గురువారం నాడు స్థానిక డి ఆర్ డి ఏ వెలుగు కార్యాలయం లో వార్షిక రుణ ప్రణాళిక, జీవనోపాదులు పట్ల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిఆర్డిఏ వెలుగు ఏపీఎం గోపాలకృష్ణ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పథకాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రభుత్వం మహిళాభివృద్ధి పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఆయన చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను మహిళలు సద్వినియోగపరచుకోవడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఏపీ ఎం గోపాలకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో సి సి లు రాజయ్య, దాసు, వెంకటరెడ్డి, మండల సమైక్య అధ్యక్షురాలు షేక్ మెహరున్నీసా బేగం, కార్యదర్శి అరుణ, కోశాధికారి సులోచన, అకౌంటెంట్ శ్రీదేవి, శ్రీనిధి మేనేజర్ బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు పెన్ పవర్ ఏప్రిల్ 16**

ఇంటర్మీడియట్ పరీక్షలలో మంచి ఫలితాలు సాధించిన కందుకూరు పట్టణంలోని సాయిబాబా ఐఐటి- జేఈఈ మరియు నీట్ అకాడమీ విద్యార్థులను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం అభినందించారు. మొదటి సంవత్సరం పరీక్షల్లో 470 మార్కులకు గాను దాసరి రేణుక వెంకటలక్ష్మి, ముచ్చు గోపీనాథ్ 466 మార్కులు సాధించారు. రెండవ సంవత్సరం పరీక్షల్లో జజ్జారపు లక్ష్మి 1000 కిగాను 991 మార్కులు సాధించింది. స్థానిక టిడిపి కార్యాలయంలో విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ గొర్రెపాటి రామారావు, కరస్పాండెంట్ గుంటూరు శ్రీనివాసులు, డైరెక్టర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు కల్లూరి శైలజ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# త్వరిత గతిన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని ప్రిన్సిపల్ సెక్రటరీని కోరిన ఎమ్మెల్యే ముత్తుముల





**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 16**

గిద్దలూరు నియోజకవర్గంలోని కోనపల్లి - బేస్తవారిపేట ,కంబం - పాపినేనిపల్లి రోడ్డు పనులు త్వరిత గతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రటరి, టి.కృష్ణబాబు., పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశం లో గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కోరారు ఈ రోడ్లు ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటాయని తెలి పారు. అవకాశం దొరికిన ప్రతి సమయంలో నియోజకవర్గ అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించి అధికారుల దృష్టిలో పెట్టి ఆపనులను సాధించ టంలో అశోకరెడ్డి ముందుంటారని పలువురు అభినందిస్తున్నారు. అవకాశాన్ని అంది పుచుకోవటంలో ఆయనకు ఆయనే సాటి అనిపించుకుంటున్నారు.

# 17న కొమరోలు విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత.

### ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం



**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 16**

కొమరోలు మండలం లోని అన్ని గ్రామాలకు ఈనెల 17వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లుగా గిద్దలూరు విద్యుత్ శాఖ డి ఈ ఈ శేషగిరిరావు ప్రకటించారని కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు లోని 132/33 విద్యుత్ సబ్స్టేషన్ లో ఏర్పడిన సాంకేతిక లోపాలను నివారించి వినియోగదారులకు నాణ్యమైన అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయుటకు విలువ ఈనెల 17వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి మరమత్తు పనులు చేపట్టనున్నట్లుగా డి ఈ ఈ శేషగిరిరావు ప్రకటించారని ఆయన తెలిపారు. ఆ కారణంగా కొమరోలు సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు ఈనెల 17వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లుగా ఆయన తెలిపారు. కావున కొమరోలు మండలంలోని నియోజకవర్గంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని విద్యుత్ శాఖ సహకరించాలని శ్రీనివాసులు కోరారు.


# సమాజంలోని అంధకారంతో పోరాడిన తెలుగు వెలుగు “కందుకూరి”

## కట్టుబాట్లను పటాపంచలు చేస్తూ, మూఢవిశ్వాసాలను చీల్చుకుంటూ ఎగిసిపడిన అగ్ని శిఖ..” వీరేశ లింగం”

## ఆంధ్రదేశం అందించిన అద్భుతమైన సంఘసంస్కర్త.. కందుకూరి

### జన విజ్ఞానవేదిక రాష్ట్ర నాయకులు స్వరూపరెడ్డి





**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 16**

తొలి ఆధునిక వైజ్ఞానిక రచయిత , దార్శనికుడు, తెలుగు జాతికి నవయుగ వైతాళికుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి , సాహిత్య వెలుగులు చిమ్మిన సూర్యుడు...”కందుకూరి”యని జన విజ్ఞానవేదిక రాష్ట్ర నాయకులు పి.స్వరూపరెడ్డి పేర్కొన్నారు గురువారం జనవిజ్ఞాన వేదికలో జరిగిన కార్యక్రమంలో స్వరూపరెడ్డి వీరేశలింగం జీవిత విశేషాలను విద్యార్థిని, విద్యార్థులకు సవివరంగా వివరించారు. ప్రముఖ రచయిత చిలకమర్తి లక్ష్మీ నరసింహం వీరేశలింగం గురించి ఇలా అన్నారు ఇది వీరేశలింగం సమాధిపై ఈనాటికీ కనిపిస్తుంది. “ తన దేహము తన గేహము తన కాలము తన ధనంబు తన విద్య జగ జ్జనులకే వినియోగించిన ఘనుడీ వీరేశలింగకవి జనులార!” కందుకూరి వీరేశలింగం పంతులుని ‘తెలుగులో సాంస్కృతికపునరుజ్జీవనోద్యమ పితామహుడు’.అని అంటారు.ఆయన 1848 ఏప్రిల్ 16న ఆంధ్ర ప్రదేశ్ లోని రాజమండ్రిలోజన్మించారు.ఆయన స్థానిక పాఠశాలల్లో చదువుకున్నారు , అక్కడ అతని విద్యా నైపుణ్యం, మంచి స్వభావం అతనికి ప్రశంసలు పొందాయి. 1869లో మెట్రిక్యులేషన్ పూర్తి చేసిన వీరేశలింగం ఒక గ్రామంలో పాఠశాల ఉపాధ్యాయునిగా పని చేయడం ప్రారంభించారు. వీరేశలింగం తెలుగు, సంస్కృతం , ఆంగ్లం అనే మూడు భాషలలో పండితుడు. తెలుగు భాషలో తొలి నవల రాశారు. ఆత్మకథ వ్యాసాన్ని తెలుగు సాహిత్యంలోకి ప్రవేశపెట్టిన ఘనత కూడా ఆయనదే నన్నారు. ఆధునిక విజ్ఞానంపై తొలి తెలుగు పుస్తకాన్ని కూడా రచించారని. ఇవే కాకుండా తెలుగులో అనేక గేయాలు, నాటకాలు రచించి. ప్రముఖ ఆంగ్ల రచనలను తెలుగులోకి అనువదించారన్నారు. స్త్రీ విముక్తి కోసం ఆయన విస్తృతంగా రాశారన్నారు. అతని రచనలు ప్రధానంగా అప్పటి నైతికత, మూఢనమ్మకాలు, ద్వంద్వ ప్రమాణాలు, సమాజంలోని అధోకరణంపై వ్యంగ్యంగా ఉన్నాయని. అతను వితంతు పునర్వివాహాలను సమర్థించారు , బాల్య వివాహాలను అలాగే చాలా పెద్ద పురుషులకు యువతులను వివాహం చేసుకునే పద్ధతిని ఖండించారన్నారు ఆయన పదునైన విమర్శ అతనికి చాలా మంది శత్రువులను తెచ్చి పెట్టిందని.అతను తన “రాడికల్” ఆలోచనలు , న్యాయవాదుల కోసం బహిరంగంగా ఎగతాళి చేయబడ్డారని. బాలికలు, మహిళల విద్య కోసం పాఠశాలలను స్థాపించారన్నారు . అతను డిసెంబర్ 11 , 1881 న ఆంధ్ర ప్రదేశ్‌లో మొదటి వితంతు పునర్వివాహాన్ని కూడా చేసారని . ఆనాటి సంప్రదాయవాద సమాజం అతనిని నిందించిందని. సమాజం యొక్క తీవ్ర అవమానం ఉన్నప్పటికీ, అతను తన జీవితకాలంలో సుమారు 40 మంది వితంతువులను వివాహం చేసుకోవడానికి సహాయం చేశారన్నారు .ఆయన వివిధ పత్రికలు, జర్నల్‌లను ప్రచురించారు , ఆయన స్త్రీ విద్య కోసం పోరాడారాణి పేర్కొన్నారు. నూరు మాటలు చెప్పేకంటే ఒక మంచిపని చేసి చూపటం అధిక ప్రయెజనం కల్గిస్తుంది. అని అయన పదే పదే బోధించారు . స్వయంగా ఆచరించారు గూడా. జనుల్లో విద్య వ్యాపించాలని, ప్రజలు తమ హక్కులను గూర్చి తాము తెలిసికోవాలని, స్వేచ్ఛగా బ్రతకాలని ప్రబోధించారన్నారు . అయన తాను మరణించేవరకు క్షణంగూడా కలం వృధాచేయలేదు. తన జాతి జనులకు మేలు కలిగించే, ఉత్తేజం కల్గించే , పనులను చేస్తూ వచ్చారన్నారు . సమాజంలో మార్పు కోసం కృషిచేసిన తొలినాటి మార్గదర్శకులలో వీరేశలింగం అగ్రగణ్యులు . అయన కూడా అందరూ సంస్కర్తల వలెనె అపార్థాలకు, అవహేళనలు గురయ్యారని.ఆయన వానిని అన్నిటిని ధైర్యంగా ఎదిరించి నిల్చిన మహోన్నత వ్యక్తి వీరేశలింగం పంతులు అని. ఆయన ‘రావ్ బహదూర్’, ‘గద్య తిక్కన’ అనే బిరుదులూ పొందారన్నారు.ఆయన జయంతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు నాటక దినోత్సవంగా ప్రకటించి అవార్డ్స్ ను అందజేస్తుందని తెలిపారు. నేటికి ఆయన ఆదర్శాలు పుణికి పుచ్చుకొని ఆచరించి భావి పౌరులు కావాలని ఆకాంక్షించారు.

# రేషన్ బదులు నగదు ఇవ్వడం దారుణం

### వైసిపి నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్ డిమాండ్



**మార్కాపురం పెన్ పవర్ ఏప్రిల్ 16**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలని కూటమి సర్కార్ కు వైసిపి మైనార్టీ అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ డిమాండ్ చేశారు. రేషన్ కార్డ్ లబ్ధిదారులకు రేషన్ లేదని వాటి స్థానంలో డబ్బులు అందజేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దీంతో పేదలైన రేషన్ కార్డు లబ్ధిదారులు ఆ సొమ్ముతో బయట పెరిగిన ధరల కు అనుగుణంగా రేషన్ కొనుగోలు చేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తిత్వం చేశారు . కాబట్టి అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ద్వారా రేషన్ పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వైసిపి హయాంలో ఇంటివద్దకే రేషన్ చేర్చే ప్రక్రియ కొనసాగేదని, ఇంటి వద్దనే నిశ్చింతగా పేద లబ్ధిదారులు రేషన్ పొందే వారిని ఆయన గుర్తు చేశారు. కూటమి సర్కార్ రాకతో ఆ అవకాశాన్ని రాష్ట్ర ప్రజలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి సర్కా రేషన్ పంపిణీలో చేస్తున్న చర్యలతో రాష్ట్ర ప్రజల భ్రమలు ఈ ప్రభుత్వం పై తొలగిపోతున్నాయని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే వైసీపీ సర్కార్ మళ్లీ వస్తుందని ఇంటి వద్దకే రేషన్ తీసుకొని వస్తుంది ఆయన హామీ ఇచ్చారు. ఇది జగన్ ఇచ్చే హామీ అని, అందుకే వైసిపి ప్రతి నేత కార్యకర్త ఈ హామీని నిర్భయంగా ఇస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## విశ్రాంత ఉపాధ్యాని రంగ లక్ష్మమ్మ అంతిమ యాత్రలో టిడిపి నాయకులు ముత్తుముల క్రిష్ణ కిశోర్



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 16**

రాచర్ల మండలం గౌతవరం గ్రామంలో రాచర్ల టి డిపి మండల పార్టీ అధ్యక్షులు కటిక యోగానంద్ తల్లి కటిక రంగ లక్ష్మమ్మ అంతిమ యాత్రలో తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీ ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి పాల్గొన్నారు రంగ లక్ష్మమ్మ పార్ధవ దేహం పై పూల మాల ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు వీరితో పాటుగా రాచర్ల మండలం, స్థానిక నాయకులు , తదితరులు భారీగా అంతిమ యాత్రలో పాల్గొని నివాళులు అర్పించారు.

# అమ్మవారిపాలెంలో 8వ పోషన్ పక్వాడ్ కార్యక్రమం



**గుడ్లూరు, పెన్ పవర్, ఏప్రిల్ 16**

ఉలవపాడు ప్రాజెక్టు పరిధిలోని గుడ్లూరు మండలం గుడ్లూరు నందు అమ్మవారిపాలెం గ్రామంలోని అంగన్వాడీ కార్యక్రమం నందు సీడీపీఓ డీ.మాధవీలత ఆదేశాల మేరకు సూపర్వైజర్ కె.కామేశ్వరి ఆధ్వర్యంలో 8వ పోషన్ పక్వాడ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాజరైన గర్భవతులు, బాలింతలకు, 7నెలల నుండి 6 సంవత్సరములలోపు పిల్లలతల్లులకు పోషన్ పక్వాడ గురించి సూపర్వైజర్ కామేశ్వరి వివరించారు. పిల్లల మానసిక వికాసానికి అడ్డంగా మారుతున్న సెల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండేందుకు ప్రత్యేక కార్యాచరణను తీసుకువచ్చారు. జంక్ ఫుడ్ తినడం వల్ల పిల్లలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. అలాగే సెల్ఫోన్ అతి వినియోగం గుండా కొందరికి మాటలు సరిగా రాకపోవడం, చూపు మందగించడం, ఊహాశక్తి లేకపోవడం తదితర సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. ఈ జంక్ ఫుడ్ పిల్లలకే కాకుండా బాలింతలు, గర్భవతులకు కూడా పెద్ద సమస్యగా మారినదని, దీనికి బదులు ప్రకృతి సహజ సిద్ధమైన గింజలు, ఆకు కూరలు వంటివి తినాలని ఈ పోషన్ పక్వాడ్ కార్యక్రమం ద్వారా వివరించడం జరిగినదని సూపర్వైజర్ కామేశ్వరి అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు శాంతకుమారి, మాధవి, స్రవంతి, శాంతమ్మ, ఆయాలు సిరివల్లి, స్వాతి , ఎలిమెంటరీ స్కూల్ టీచర్ శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జీవనోపాదులు మెరుగుపరుచుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

## మహిళలు ఆర్థికాభివృద్ధి చెందితేనే రాష్ట్రాభివృద్ధి -సెర్ప్ అదనపు సంచాలకులు దేగలయ్య





**అర్ధవీడు, పెన్ పవర్, ఏప్రిల్ 16**

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందితేనే రాష్ట్రాభివృద్ధి చెందుతుందని సెర్ప్ అదనపు సంచాలకులు దేగలయ్య అన్నారు. గురువారం మండలంలోని నాగులవరం సచివాలయం నందు నాగులవరం క్లస్టర్ పరిధిలోని విఓఏలు, ఈ నారి, సిఆర్పి లకు జీవనోపాదుల మెరుగు పరచుకునేందుకు ఎసి ఎల్ పి వార్షిక ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఏడాదిలో గ్రూపు సభ్యులకు అవసరమైన రుణాలను గుర్తించి, వారి జీవనోపాధులను మెరుగుపరచడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి పథకాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రభుత్వం మహిళాభివృద్ధి పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను మహిళలు సద్వినియోగ పరచుకోవడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలియజేశారు. ఎపిఎం పి రమేష్ మాట్లాడుతూ ప్రతి గ్రామ సంఘం పరిధిలో కనీసం 15 మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా తయారీ, సేవల రంగాల్లో ప్రోత్సాహం అందిస్తామన్నారు. వ్యక్తిగత, గ్రూపు అవసరాల కోసం ఏ నెలలో ఎంత రుణం కావాలో సభ్యులు సర్వేలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం ఎల్ హెచ్ డి దానం, ఎపిఎం పి రమేష్, సీసీ గురువయ్య, విఓఎలు, సి ఆర్ పిలు, ఈ నారిలు తదితరులు పాల్గొన్నారు.

# బిఎస్ఎన్ఎల్ పెన్షనర్లపై వివక్షను వీడాలి

## డి ఏ తక్షణమే విడుదల చేయాలి

## బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద పెన్షనర్ల ధర్నా




**మార్కాపురం పెన్ పవర్ ఏప్రిల్ 16**

బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్, పెన్షనర్లకు ఈ ఏడాది జనవరి నుండి పెంచిన డియర్ నెస్ రిలీఫ్ ను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు శ్రీనివాసరెడ్డి. షేక్ సలీం లు మాట్లాడుతూ పెన్షన్ చెల్లింపుల విధానాలపై కుట్రలు జరుగుతున్నాయని, పాత కొత్త తారతమ్యాలు ప్రయత్నాలు ప్రభుత్వం చేపట్టిందని ఈ ప్రయత్నాలను తిప్పి కొట్టి న్యాయబద్ధమైన హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. 27ఫిబ్రవరి 2006 తేదీన జారీచేసిన డిపిఈ కార్యాలయ స్మరణిక లోని పేరా ఐదును ఉపసంహరించుకోవాలని, భవిష్యత్తులో డియర్ నెస్ రిలీఫ్ ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపుమేరకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని ప్రభుత్వం స్పందించకుంటే కార్యచరణ ఉద్యమం తీవ్రంగా ఉంటుందని తెలిపారు. న్యాయబద్ధమైన హక్కులను కాపాడుకోవడానికి చేస్తున్న ఈ సామూహిక ఉద్యమంలో ప్రతి పెన్షనర్ తప్పకుండా హాజరై ఐక్యతను చాటవలసిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు అందే నాసరయ్య, ఎం కృష్ణారావు, పి, పాండురంగయ్య, షేక్ ఇమామ్, ఖాదర్, షేక్ పీరా, బాలయ్య, టి, సాల్మన్, శంకర్రావు, శ్రీరాములు, డి మంగయ్య, లతోపాటు అన్ని యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# సీఐ వినోద్ కుమార్ ను సత్కరిస్తున్న డాక్టర్ మల్లికార్జున రెడ్డి

## సీఐ వినోద్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ మల్లికార్జున రెడ్డి.




**పామూరు పెన్ పవర్, ఏప్రిల్ 26**

పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గా నూతన బాధ్యతలు స్వీకరించిన డి. వినోద్ కుమార్‌ను మల్లికార్జున రెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ పి. మల్లికార్జున రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి శనివారం నిర్వహించనున్న 17వ వారపు అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించాల్సిందిగా ఆహ్వానించిన ఆయన తెలిపారు. సీఐ వినోద్ కుమార్ తప్పకుండా పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తానని హామీ హామీ ఇచ్చినట్లు డాక్టర్ మల్లికార్జున్రడ్డి.

# 18న కొమరోలులో ప్రజా దర్బార్

*మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా దర్బార్ కు ముఖ్య అతిథిగా పాల్గొననున్న గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి.*



**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 16**

కొమరోలు లోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈనెల 18 వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లుగా ఎంపీడీవో రమేష్ బాబు తెలిపారు. ఆ కార్యక్రమానికి గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని ఆయన చెప్పారు. కావున కొమరోలు మండలంలోని ప్రజలు తమ ఎదుర్కొంటున్న సమస్యలను అర్జీల రూపంలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో సమర్పించి వాటి పరిష్కారానికి సహకరించాలని ఎంపీడీవో కోరారు. ఈ సదవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

# విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి ఎమ్మెల్యే ఉగ్రకు ఆహ్వానించిన కొత్తపల్లి గ్రామస్తులు

**పామూరు, పెన్ పవర్, ఏప్రిల్ 16.**

మండలంలోని దూబగుంట పంచాయతీ కొత్తపల్లి గ్రామంలో ఈనెల 19 నుండి 23 వరకూ జరగబోయే శ్రీ కోదండ రాములవారి నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యాక్రమానికి ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యేడాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి గ్రామ నాయకులు దయిండే శంకర్, కోటపాటి వెంకటేశ్వర్లు, దొడ్డ వెంకట్ రెడ్డి, చింతలపూడి మల్లికార్జునెడ్డి, కోటపాటి రాము, కోటపాటి హజరత్, కోప్పాల సంజీవరెడ్డి, రమేష్ శ్రీకాంత్, చింతలపూడి మల్లికార్జునలు ఆహ్వాన పత్రికను ఇవ్వడం జరిగింది. పామూరు మండలంలోని టీడీపీ నాయకులు పువ్వాడి వెంకటేశ్వర్లు, గుంటుపల్లి శ్రీనులకు ఆహ్వాన పత్రికను గ్రామ నాయకులు అందజేశారు.



# రహదారులే.. మా అడ్డా!!

## భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు -విచ్చలవిడిగా ఆవులను వదిలేసిన యజమానులు

## పట్టించుకోని అధికారులు -మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఆవుల మంద దాడి

## తీవ్ర గాయాలపాలైన మహిళ





**మార్కాపురం పెన్ పవర్ ఏప్రిల్ 16**

పట్టణంలోని ప్రధాన రహదారులపై పశువులు సంచారం పెరగడంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో ప్రతిరోజు వేలాది మంది వారి పనుల నిమిత్తం హడావుడిగా వెళుతూ,వాస్తు ఉంటారు. ఈ నేపథ్యంలో ప్రతి రోజు గేదెలతో ఓ సమస్య వేధిస్తోంది. సరిగ్గా రోడ్డు మధ్యలో పశువులు తిష్టవేసి వచ్చి పోయే వాహనాలకు స్పీడు బ్రేకర్లుగా తయారవుతున్నాయి. వీటిని తప్పించుకు పోవాలంటే ప్రజలకు గగనమవుతోంది. పట్టణ శివారు ప్రాంతంల్లోనో లేక ఏదైనా వీధిలో అయితే పర్వాలేదు. ఏకంగా ప్రధాన కూడళ్లైన ఆర్టీసీ బస్టాండు, గడియార స్తంభం సర్కిల్ వద్ద, రైతు బజార్, కాలేజీ రోడ్డు, తర్లుపాడు రోడ్ల మధ్యలో గంటల తరబడి ఇవి నిలబడడం, పడుకోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. పశువులు గుంపులు గుంపులుగా రోడ్డుకు అడ్డంగా రావడంతో వాహనాలు తిరగబడి ప్రమాదాలు జరగడం, పదాచారూలపై దూసుకురావడం వంటి సంఘటనలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పశువులు రోడ్లపైకి విచ్చలవిడిగా తిరుగుతూ వాహనచోదకులతోపాటు చిరువ్యాపారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. తోపుడు బండ్లపై ఆకుకూరలు, కూరగాయలు, పలు రకాల పండ్లను తింటూ పాడు చేస్తున్నాయని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**హెచ్చరికలు సరే.. చర్యలేవీ?..:** రోడ్డు మీదకు ఆవులు, గేదెలను వదిలితే చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరికలు జారీ చేసే మున్సిపల్ అధికారులు వాటిని అమలు చేయటంలో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రోడ్డు మీదకు వదిలిన పశువులను బందించి అపరాద రుసుం వసూలు చేస్తేనే ఈ సమస్య కొంతవరకు తీరుతుందని ప్రజలు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అలా చేస్తేనే వాటిని బయటకు రానీయకుండా యజమానులు జాగ్రత్త పడతారు. ప్రస్తుతం మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్లపైకి వచ్చి యథేచ్ఛగా తిరుగుతున్నాయి. ఇప్పటికైనా వాటి యజమానులు జాగ్రత్తలు తీసుకునే విధంగా మున్సిపల్ అధికారులు కట్టడి చేయాలని పట్టణ ప్రజలు, వాహనచోదకులు, పాదచారులు కోరుతున్నారు.

**ఆవుల దాడిలో మహిళకు తీవ్ర గాయాలు..:** మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో గురువారం మున్సిపల్ కార్యాలయానికి సమీపంలో ఆవుల మంద ఓ గుర్తుతెలియని మహిళను ఢీకొట్టాయి. ఈ ఘటనలో మహిళా తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనంలో ఆమెను ఆసుపత్రికి తరలించారు. పశువులను నియంత్రించి ప్రజల ప్రాణాలను కాపాడాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ప్రధాన రోడ్లపైన సంచరిస్తున్న ఆవులు కుక్కలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# కందుకూరూ పబ్లిక్ స్కూల్లో ఘనంగా కిడ్స్ కాన్వకేషన్







**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 16**

స్థానిక పామూరూ రోడ్డు నందు గల కందుకూరు పబ్లిక్ స్కూల్ ప్రీ ప్రైమరీ విద్యార్థుల కిడ్స్ కాన్వకేషన్ పాఠశాల 5వ వార్షికోత్సవం పామూరు రోడ్డులో గల లక్ష్మీ తిరుమల ఫంక్షన్ హాల్ నందు బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు డి. బాల బ్రహ్మం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ టి. పద్మావతి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా విలువలతో కూడిన విద్యను అందిస్తూ విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేశామని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ పి.వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు చక్కని హాస్టల్ వసతి కల్పిస్తూ చదువులతో పాటు వారి శారీరక ఎదుగుదలకు గేమ్స్, మానసిక ఎదుగుదలకు మోటివేషన్ క్లాసులు నిర్వహిస్తున్నామని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి కందుకూరు జూనియర్ కాలేజీ ప్రారంభిస్తున్నామని, సహకరిస్తున్న తల్లిదండ్రులకు, శ్రేయోభిలాషులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో లింగసముద్రం మండలం మాజీ ఎంపీపీ పి.బాలకోటయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# స్మార్ట్ విద్యలో విప్లవం - జాతీయ స్థాయిలో స్పందనకు అగ్రస్థానం

## నేడు హైదరాబాద్‌లో స్పందనకు జాతీయ అవార్డు స్వీకారం.

**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 16**

రాచర్ల మండల కేంద్రంలోని స్పందన విద్యా సంస్థలు మరో అత్యున్నత పురస్కారాన్ని అందుకోబోతున్నాయి. దేశవ్యాప్తంగా స్మార్ట్ క్లాసులను నిర్వహిస్తున్న పాఠశాలల్లో కెల్లా స్పందన స్మార్ట్ స్కూల్ దేశీయ మొదటి స్థానం సాధించిన విషయం తెలిసిందే. ఈ అవార్డును శుక్రవారం హైదరాబాద్‌లోని నోవోటెల్ హోటల్‌లో ఘనంగా నిర్వహించనున్న కార్యక్రమంలో స్వీకరించనున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ విజయానికి కారణమైన ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల ప్రతిభ, తల్లితండ్రుల సహకారం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఆధునిక బోధనా విధానాలు, స్మార్ట్ క్లాసెస్ అమలు ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధి సాధ్యమైందని తెలిపారు. మా మీద నమ్మకం ఉంచి సహకరించిన తల్లితండ్రులకు, కష్టపడి పనిచేసిన ఉపాధ్యాయులకు, ప్రతిభ చాటిన విద్యార్థులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇలాంటి విజయాలతో ముందుకు సాగుతూ, విద్యా రంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే అత్యుత్తమ సంకల్పంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.

# విద్యా ప్రమాణాలు మదింపు కోసం ఎఫ్ఎల్ఎస్ సర్వే

## ఎంఈఓ రాజాల కొండారెడ్డి





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 16**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మదింపు కోసం ఫౌండేషన్ లిటరసీ స్టాండర్డ్స్ సర్వే నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డి అన్నారు జాతీయ స్థాయి సంస్థ పరక్ ఆధ్వర్యంలో డైట్ విద్యార్థులు జిల్లాలోని ఎంపిక చేసిన పాఠశాలల్లో సర్వే చేస్తున్నారన్నారు మండలంలోని ఆర్ కె పల్లి ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న సర్వేని పరిశీలించారు గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ , ఎఫ్ ఎల్ ఎస్ ఇటువంటి సర్వేల ద్వారా విద్యార్థుల అభ్యాసన స్థాయిలను అంచనా వేయడం జరుగుతుందన్నారు బడిఈడు పిల్లలందరూ పాఠశాలల్లో నమోదయ్యేలా చూడాలని, పాఠశాలల్లో చేరిన ప్రతి ఒక్కరూ పదవ తరగతి ద్వారా పూర్తి అయ్యేలా కొనసాగాలని కోరారు అనంతరం చింతపూడి, అగ్రహారం , ఆర్ కె పల్లి గ్రామాలలో గురువారం ఎంఈఓ రాజాల కొండారెడ్డి ఆధ్వర్యంలో ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించారు గ్రామ సచివాలయలు, విద్యార్థుల ఇండ్లకు వెళ్లి ఇంటింటి ప్రచారం నిర్వహించారు ప్రభుత్వ పాఠశాలల్లో సకల సదుపాయాలు ఉన్నాయని తల్లికి వందనం మధ్యాహ్న భోజనం విద్యార్థి కిట్లు వంటి పలు ప్రోత్సాహాలు కూడా ఉచితంగా అదుతాయని తెలియజేశారు సర్వే పరిశీలన కార్యక్రమం ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమంలో ఎంఈఓ రాజాల కొండారెడ్డి, ప్రధానోపాధ్యాయులు డేవిడ్, కిరణ్, భాషా తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు కొనుగోళ్లు ప్రతిరోజు జరిగేటట్లు ప్రజా ప్రతినిధులు పర్యవేక్షణ చేయాలి - సిపిఎం డిమాండ్

**కందుకూరు పెన్ పవర్,ఏప్రిల్ 16**




26,27 పొగాకు వేలం కేంద్రాలలో ప్రతిరోజు కనీసం 100 బేళ్ళకు తగ్గకుండా కొనుగోళ్లు చేసేవిధంగా ప్రజా ప్రతినిధులు,బోర్డు అధికారులు చర్యలు చేపట్టాలని, తద్వారా కందుకూరు నియోజకవర్గం లోని రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీ. వీ కొండారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణం లోని సుందరయ్య భవన్ లో సిపిఎం కందుకూరు నియోజకవర్గ స్థాయి వర్క్ షాప్ ఆ పార్టీ పట్టణ కార్యదర్శి ఎస్.ఏ. గౌస్ భాషా అధ్యక్షత వహించారు. ఈ వర్క్ షాప్ కు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీ.వీ. కొండారెడ్డి,యం.రమేష్ లు హాజరయ్యారు. ఈ సీజన్ లో కొనుగోళ్ల ప్రారంభించడమే ఆలస్యం అయిందని అన్నారు. కొనుగోళ్లు లో కనీసం 15మంది బయ్యర్లు ఉండాల్సిఉంటే 8 మందే ఉన్నారని అన్నారు. కొనుగోళ్లు లో 100బేళ్లు పెడుతుంటే వాటిలో 20 శాతం రిటర్న్ అవుతున్నాయని అన్నారు. ఇంత మందకోడి గా వేలం జరుగుతున్నందున, పోగాకు నిరుత్సాహంగా ఉన్నారని పేర్కొన్నారు.ఈ రకంగా జరిగితే జనవరి మొదటి వారం దాకా కొనుగోళ్లు ఉంటాయని అన్నారు. దీనివల్ల పోగాకు రైతాంగం తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని అన్నారు. పోగాకు కొనుగోళ్ల సందర్భంలో ప్రజాప్రతినిధులు తరచూ బోర్డు ను సందర్శించాలని కోరారు. గతం కంటే పోగాకురైతులకు ఖర్చులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కిలో ధర 300 ఎవరేజ్ ఉండేటట్లు చూడాలని డిమాండ్ చేశారు. వేసవి లో ఎండలు తీవ్రంగా ఉన్న రీత్యా గ్రామాలలోని ప్రజలకుత్రాగునీటి సమస్య లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. కందుకూరు నియోజకవర్గం లోని అన్నీ గ్రామాలలో ఉపాధి పనులు ప్రారంభించి, కూలీలను ఆదుకోవాలని కోరారు.ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యం.రమేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం లోని ప్రజలవద్దకు సిపిఎం కార్యకర్తలు ఉద్యమనిధి కొరకు వస్తారని తెలిపారు.ఉదారంగా సహకరించాలని కోరారు. నియోజకవర్గసమస్యలపై సిపిఎం గుడ్లూరు, ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శులు జీ. వెంకటేశ్వర్లు,జీవీబీ కుమార్ లు మాట్లాడారు.ఈ సమావేశాల్లో కందుకూరు పట్టణం, గుడ్లూరు, వలేటివారిపాలెం, ఉలవపాడు, లింగసముద్రం మండలాలలోని సిపిఎం నాయకులు షేక్.మున్వర్ సుల్తానా,మల్లిక,యం.పద్మ కొట్టే వెంకయ్య, దామా.కృష్ణయ్య, బీరకాయల వెంకటేశ్వర్లు, మాదాల రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నరసింహంను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే దివి శివరాం



**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 16:**

కరేడు గ్రామపంచాయతీ పరిధిలోని అంకమ్మ పాలెం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యల్లంగారి నరసింహం పక్షవాతం జబ్బుతో బాధపడుతూ ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్నాడనే విషయాన్ని తెలుసుకున్న కందుకూరు మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం గురువారం నరసింహం ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని జాగ్రత్తగా ఉండాలని , వైద్యుల సలహా మేరకు మందులు మింగుతూ ఎక్కువగా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. శివరాం వెంట కాకర్ల మల్లికార్జునరావు , ఉలవపాడు మాజీ ఎంపీటీసీ షేక్ బాజీ , కాటం లక్ష్మణ్ రావు తదితరులు ఉన్నారు.

# 21నుంచి తంబళ్ళపల్లె రామాలయం తిరుణాల



**గిద్దలూరు, పెన్ పవర్ ఏప్రిల్ 16**

గిద్దలూరు మండలం తంబళ్ళపల్లె గ్రామం శ్రీ అభయ ఆంజనేయ, అంకాలమ్మ, పోలేరమ్మ సహిత శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం తిరుణాలను ఈ నెల 21మంగళవారం నుంచి 23 గురువారం వరకు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. 21న ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనంతో ఉత్సవం ప్రారంభమమవుతుంది. 22 వతేదీ బుధవారం ఉదయం11గంటలకు శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. తదుపరి సుదర్శనాది వివిధ హోమాలు చేపడతారు. 23 గురువారం పూర్ణాహుతి, వివిధ దేవతల విశిష్ట ఆరాధన,తీర్థ ప్రసాద వితరణ, వేద పండిత ఆశీర్వచనం ఉంటాయి. ఈ ఉత్సవం స్మార్త పండితులు యడవల్లి కార్తికేయ శర్మ, దుర్భాక అనిల్ శాస్త్రి ఆచార్యత్వమున సాగుతుంది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా 22 వతేది బుధవారం సాయంత్రం 5 గంటలకు కోలాటం ప్రదర్శన,రాత్రి 10 గంటలకు ఆర్కెస్ట్రా ప్రోగ్రామ్ నిర్వహిస్తారు.

# గిద్దలూరు పట్టణంలో చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ సురేష్



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 16**

గిద్దలూరు పట్టణానికి చెందిన రిటైర్డ్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ జంగాల బాలయ్య తన తల్లిదండ్రులైన జంగాల సుబ్బమ్మ జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని సొంత నిధులతో ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని గిద్దలూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సురేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి ఒబిలిబోయిన వెంకటయ్య యాదవ్,రాష్ట్ర యాదవ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు డాక్టర్ మొర్రి. పిచ్చయ్య పాల్గొన్నారు. బాలయ్య మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజల దాహాన్ని తీర్చుటకు తన వంతు సామాజిక సేవ చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమం వేసవి కాలమంతా కొనసాగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల శ్రీనివాసులు, నంద్యాల పీరయ్య, నారాయణమ్మ, యశ్వంత్ యాదవ్, బాలదీక్షిత్ యాదవ్, రాజ్యలక్ష్మి, కడిదం. శ్రీనివాసులు,ఉమా మహేశ్వర రావు, విశ్వరూపం, శేఖర్, రమణ తదితరులు పాల్గొని జంగాల బాలయ్య ను అభినందించారు.

# విద్యావారోత్సవాలు మండల విద్యావనరుల కేంద్రం



**రాచర్ల, పెన్ పవర్, ఏప్రిల్ 16**

మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల అనుమలపల్లి రాచర్ల మండలం రాష్ట్ర విద్యాశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల, ఉపాధ్యాయులు పేరెంట్స్ కమిటీ సహకారంతో ఈనెల 16 నుండి 22 వరకు విద్యావారోత్సవాలు నిర్వహించవలసియున్నది. ఈ కార్యక్రమంలో భాగంగామండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల అనుమలపల్లి ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అనుమలపల్లి గ్రామ పరిధిలో డోర్ టు డోర్ క్యాంపెయిన్, ర్యాలీలు, దండోరా, ప్రైవేటు పాఠశాలకు వెళ్లే తల్లి దండ్రులను కలిసి ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, మన బడి మన భవిష్యత్తు, ఎస్ ఆర్ కె వి ఎమ్ కిట్స్ గురించి వివరించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా కృషి చేస్తున్నారు. సకల సౌకర్యాల గుడి ప్రభుత్వ బడి ఊరి బడిని కాపాడుకుందాం - గ్రామ భవిష్యత్తును నిర్మించుకుందాం. అనే నినాదాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు జరిగింది. 16 న నిర్వహించిన కార్యక్రమంలో 5 సంవత్సరాలు నిండిన 5మంది విద్యార్థులను మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల లో చేర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెడ్డి జయభారతి రెడ్డి, ఉపాధ్యాయులు, సర్పంచ్ సిరిగిరి రమేష్ ఎస్ ఎమ్ సి చైర్మన్ శ్రీ గోన కాశయ్య మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## నారా లోకేష్, దామచర్ల సత్య, నూకసాని బాలాజీ లకు అభినందనలు తెలిపిన బైరెడ్డి, దారపనేని



**పామూరు, పెన్ పవర్, ఏప్రిల్ 16**

తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు నూకసాని బాలాజీ, జోనల్ కోఆర్డినేటర్ గా దామచర్ల సత్యా, కార్యనిర్వహక కార్యదర్శిగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ను తెలుగుదేశం పార్టీ నియమించటం హర్షించదగ్గ పరిణామం అని, కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు గురువారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బైరెడ్డి, దారపనేని మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ నాయకులు, ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర టిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు సారధ్యంలో ఎన్నికైన వారు పార్టీని పటిష్టమైన కార్యచరణతో తీసుకెళ్లేందుకు బుధవారం ప్రకటించిన నాయకులందరూ అహర్నిశలు పార్టీ ప్రయోజనాల కోసం, క్షేత్రస్థాయి నుండి పార్టీ బలోపేతం కొరకు అనునిత్యం కృషి చేస్తారని ఆకాంక్షించారు. తాతాయపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు గోరంట్ల ప్రభాకర్ అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

## పాడేరులో ఘనంగా అన్నా క్యాంటీన్ ప్రారంభం

### ఆహార భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం : మంత్రి సంధ్యారాణి




**పాడేరు, పెన్ పవర్ ఏప్రిల్ 16**

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు లో అన్నా క్యాంటీన్‌ను గురువారం ఉదయం ఘనంగా ప్రారంభించారు. ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్ నిశాంతి, ఎస్పీ అమిత్ మరియు జిల్లా యంత్రాంగం హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అన్నా క్యాంటీన్ ద్వారా పేద మరియు మధ్యతరగతి ప్రజలకు ఆహార భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా నాణ్యమైన ఆహారం అందించాలని అధికారులకు సూచించారు. అలాగే స్థానిక ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బూత్ స్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం

## బిజెపి జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు






**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 16**

నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో బిఎల్ఎ 2 నియమించి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించి భారతీయ జనతా పార్టీ ని బలోపేతం చేసే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు అన్నారు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి వి యన్ మాధవ్ ఆదేశాల మేరకు గురువారం స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ కార్యక్రమము కనిగిరిలో నిర్వహించిన బీజేపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం ఉత్సాహభరితంగా జరిగింది. పార్టీ బలోపేతంపై దృష్టి సారిస్తూ జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు పలు కీలక సూచనలు చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం నేపథ్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో బూత్ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయాలని ఆయన స్పష్టం చేశారు.ప్రతి పోలింగ్ కేంద్రంలో బీజేపీ తరఫున బీఎన్ఏ-2లను తప్పనిసరిగా నియమించాలని, బూత్ లెవెల్ ఆఫీసర్లతో సమన్వయం చేసుకుంటూ ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో లోపాలు లేకుండా చూడడం ద్వారా ఎన్నికల సమయంలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ప్రజలతో నిత్యం మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలు సూచించడం ద్వారా పార్టీపై విశ్వాసం పెరుగుతుందని తెలిపారు.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు నియోజకవర్గ స్థాయి బిఎల్ఎ 2 గా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నరాల శ్రీనివాసుల రెడ్డి ని రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ నియమించాలని తెలిపారు బూత్ స్థాయిలో ఎదురయ్యే ఏవైనా సమస్యలను వెంటనే శ్రీనివాసుల రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు పార్టీ బలోపేతానికి క్రమబద్ధమైన ప్రణాళిక, సమన్వయం కృషి అవసరమని ప్రతి కార్యకర్త తన బాధ్యతను గుర్తించి పనిచేస్తేనే బిజెపి పార్టీ బలోపేతం అవుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జె వి నారాయణ, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నరాల శ్రీనివాసుల రెడ్డి, ఎస్ఐఆర్ కన్వీనర్ దండు శ్రీనివాసులు, ఎస్ఐఆర్ కో కన్వీనర్ కొండిశెట్టి వెంకటరమణయ్య, మండల అధ్యక్షులు నారాయణరెడ్డి, సి ఎస్ పురం మండల అధ్యక్షులు పాశం రామకృష్ణ, బిజెపి సీనియర్ నాయకులు వద్దిపాటి వెంకటేష్, బిజెపి నాయకులు గంజి మనోజ్ రెడ్డి, ముక్కు వెంకట రెడ్డి, త్రిమూర్తులు, నరసింహులు, తిప్పలూరు శ్రీనివాసులు, ఇండ్ల సత్యం, పార్టీ అధ్యక్షులు నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రఘురామ కృష్ణం రాజును అరెస్ట్ చేయాలి

## - దళిత నేత నీలం డిమాండ్




**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 16**

రాముడు పేరుతో ఆకువీడు మాలపల్లిలోకి పోలీసు బలగాలతో వెళ్లి బొట్టు లేని మహిళలు అంటూ అవమానించిన డిప్యూటీ స్పీకర్ హోదాలో మాలపల్లి పై దాడి చేసి అక్రమ అరెస్టులు చేయించిన ఆంధ్రా రాజాసింగ్ రఘురామకృష్ణంరాజును మత విద్వేషం చట్టం కింద అరెస్టు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్ర డిమాండ్ చేశారు. కందుకూరు పోలీస్ స్టేషన్ ముందు జరిగిన నిరసన కార్యక్రమంలో నీలం మాట్లాడుతూ పేద ప్రజలు బ్యాంకుల్లో దాచుకున్న వేలకోట్ల రూపాయలను వ్యాపారాల పేరుతో ఫేక్ కంపెనీలు స్థాపించి వేలాది కోట్లు దోచుకున్న, సీబీఐ కేసులు ఉన్న మోసగాడు. దళిత అధికారులైన సునీల్ కుమార్, విజయ్ కుమార్, హర్ష కుమార్, జడ శ్రావణ్ కుమార్ లను పనికిమాలిన వెధవలు అంటూ పబ్లిక్ గా చంద్రబాబు పవన్ కళ్యాణ్ అండతో అవమానించటం కూటమి ప్రభుత్వ సనాతన ధర్మానికి పరాకాష్ట అన్నారు. తమ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని అవమానించారని కార్యకర్తలపై నాన్ బైలబుల్ కేసులు పెట్టి అరెస్టు చేయిస్తున్న చంద్రబాబు పవన్ కళ్యాణ్ డిప్యూటీ స్పీకర్ పోస్టులో ఉన్న బ్యాంకు లూటి కింగ్ రఘురామకృష్ణ రాజు పై కూడా కేసు నమోదు చేయించాలన్నారు. ఆకువీడు నియోజకవర్గం లో అనుమతి లేని చర్చిలను కూల్చి వేయటానికి నోటీసు లు ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రం లోని అనుమతులు లేని గుడులు, వైయస్సార్, ఎన్టీఆర్ విగ్రహాలను కూడా తొలగించాలని డిమాండ్ చేశారు. ఆకువీడు మాల పేట పై డీప్యూటీ స్పీకర్ హోదా లో, పోలీస్ బలగాలతో టీడీపీ, జనసేన కార్యకర్తలతో వెళ్లి మత ఘర్షణల కు సనాతన కూటమి డాడీ చేయటం హెయమన్నారు. ఆకువీడు ఘటన లో 63మంది మాలల పై హత్యయత్నం మత విద్వేస చట్టం క్రింద పోలీస్ కేసు లు పెట్టి 10వ తరగతి పరీక్షలు రాయకుండా పిల్లలును, మహిళలను అరెస్టు చేయటం కూటమి ప్రభుత్వం మాలల అణిచి వెతకు నిదర్శనం అన్నారు.ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారులు పాలేటి కోటేశ్వరరావు, అయ్యన్న, మాల మహానాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాకుమాను రవి, మేడికొండ మురళి, యానాది సంఘం నాయకులు కోలా జీవరత్నం, బొమ్మల వంశీ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణ బలిజ సంఘం ఆశయ సాధనకు కృషి చేస్తా

### - వై.దుర్గా హరి ప్రసాద్





**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 16:**

కృష్ణ బలిజ సంఘం ఆశయ సాధనకు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ కృష్ణ బలిజ సంఘం రాష్ట్ర కో ఆప్షన్స్ సభ్యులు యర్రంశెట్టి దుర్గా హరి ప్రసాద్ అన్నారు. ఇటీవల ఒంగోలులో జరిగిన ఆంధ్రప్రదేశ్ కృష్ణ బలిజ సంఘం రాష్ట్ర 14వ మహాసభలో యర్రంశెట్టి దుర్గా హరిప్రసాద్ రాష్ట్ర కమిటీలో ఎన్నికైన సందర్భంగా కందుకూరు పట్టణంలోని కొత్తపాలెంలో కృష్ణ బలిజ సంఘం పెద్దలు గురువారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యర్రంశెట్టి దుర్గా హరిప్రసాద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి సముచిత స్థానం కల్పించినందుకు ఆంధ్రప్రదేశ్ కృష్ణ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి శ్రీనివాసరావుకు, రాష్ట్ర కమిటీకి, తనపై నమ్మకం ఉంచి తనను ముందుకు నడిపించిన కందుకూరు కృష్ణ బలిజ సంఘం పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం తమ కృష్ణ బలిజ సంగీయులు బీసీ డీ గా పరిగణించబడుతున్నారని తద్వారా రిజర్వేషన్లను కోల్పోయి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని బీసీ డీ నుండి బీసీ ఏకి మార్చేందుకు రాష్ట్ర నాయకత్వం పోరాటం చేస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కృష్ణ బలిజ సంగీయులను గుర్తించి బీసీ డీ నుండి బీసీఏ కి మార్చాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణనలో ప్రతి కృష్ణ బలజ సంఘీయుడు తమ పేర్లను నమోదు చేసుకుని రాష్ట్ర ప్రభుత్వానికి కృష్ణ బలిజ సంఘీయుల సంఖ్యను తెలిసేలా చూడాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కృష్ణబలిజ సంఘం పెద్దలు యర్రంశెట్టి దుర్గా హరిప్రసాద్ను చాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ బలిజ సంఘం కొత్తపాలెం పెద్దలు బండి భాస్కరరావు, నీలి శెట్టి రమణయ్య, పాశం బాలయ్య, పాశం శ్రీనివాసులు, నాయుడు మాల్యాద్రి, నీలిశెట్టి నారాయణ, యర్రంశెట్టి కోదండ రామయ్య, పసుపులేటి బాలకృష్ణ, నీలిశెట్టి నరసయ్య, చెన్నం శెట్టి చందు, ముద్రకొలను మాలకొండయ్య, పాశం సుబ్రమణ్యం, పాశం అయ్యప్ప, పాశం శ్రీకాంత్, పాశం సాయి, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు ఆధార్ అవస్థలు

## ఆధార్ కేంద్రం వద్ద బారులు





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 16**

మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త సాఫ్ట్వేర్ కారణంగా కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొబైల్ యాప్ ద్వారా హాజరు నమోదు కోసం ఐరిస్ ఆధారిత ఈ-కేవైసీ తప్పనిసరి చేయడంతో అనేక మందికి సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ సిబ్బంది సూచన మేరకు కూలీలు ఆధార్ కేంద్రాలకు వెళ్లి ఈ-కేవైసీ పూర్తి చేయించుకోవాల్సి రావడంతో మండల కేంద్రంలోని సి.ఎస్.పురం ఆధార్ కేంద్రం వద్ద గురువారం భారీ రద్దీ నెలకొంది. ఉపాధి కూలీలతో పాటు కొత్తగా ఆధార్ కార్డు పొందాలనుకునేవారు, మార్పులు చేర్పులు చేసుకునేవారు, ఫోన్ నంబర్ లింక్ చేసుకునేవారు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.అయితే కేంద్రంలో విద్యుత్ సరఫరా అంతరాయం, నెట్వర్క్ సమస్యల కారణంగా నమోదు ప్రక్రియ మందగించడంతో ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. చాలామంది ఐరిస్ నమోదు జరగకపోవడం, ఫోన్ నంబర్ లింక్ కాకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పథకాలు, బ్యాంకు లావాదేవీలకు ఆధార్-ఫోన్ లింక్ తప్పనిసరి కావడంతో అవస్థలు పడి దరఖాస్తులు నింపి ఇచ్చిన సకాలంలో మార్పులు చేర్పులు జరగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు తెలిపారు ఈ సమస్యపై ఆధార్ ఆపరేటర్ జయప్రకాశ్ ను ప్రశ్నించగా విద్యుత్ అంతరాయం అప్పుడప్పుడు ఏర్పడడం మరియు సర్వర్ నెమ్మదిగా పనిచేయడం వల్ల నమోదు ఆలస్యం అవుతుందని తెలిపారు నెట్ వర్క్ పనిచేయగానే పెండింగ్ నమోదు పూర్తి చేస్తామని తెలిపారు సాంకేతిక లోపాలు తొలగించి ఆధార్ నమోదు సమస్యను పరిష్కరించాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com